Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 144 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 8 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

**- అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి - విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య**



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తత సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని..కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకు సాగిందన్నారు.

## ఆఫ్కాఫ్ ఛైర్మెన్ గా ఏకగ్రీవంగా టీడీపీ అభ్యర్థి యాటగిరి రాంప్రసాద్ ఎన్నిక

**- మొత్తం 13 మంది ఓటర్లలో 12 మంది ఒకే మాటతో ఏకగ్రీవమైన ఛైర్మన్ ఎన్నిక**

**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడ రూరల్ పోరంకిలోని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర మత్స్య సహకార సంఘాల ఛైర్మన్ ఎన్నికలలో ఏకగ్రీవంగా యాటగిరి రాంప్రసాద్ ఎన్నిక. ఈ ఎన్నికల్లో ఏపీలోని 13 జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు ఓటర్లు. 11 జిల్లాల అధ్యక్షుల ఓట్లతో కలిసి నామినేషన్ దాఖలు చేసిన కడప జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు యాటగిరి రాంప్రసాద్. మరో నామినేషన్ వేయడానికి వీలు లేకుండా.. మొత్తం 13 మంది ఓటర్లలో 11 మంది ఒకే మాటతో ఛైర్మన్ గా యాటగిరి రాంప్రసాద్ నామినేషన్‌ను బలపరచడంతో.. మొత్తం 12 మంది సభ్యుల బలంతో యాటగిరి రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఛైర్మెన్‌గా ఎన్నిక.



## గోదావరి మిగులు జలాలపై రాజకీయాలు తగవు


**- తెలుగుజాతి ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి - రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడడం సరికాదు - దేవాదులను మరింత ముందుకు తీసుకెళ్లండి - దేవాదులకు తామెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు - జగన్ అవినీతి కేసులపై విచారణకు 30 ఏళ్లు పట్టవచ్చు - ప్రాజెక్ట్ పనులు పరిశీలించాక మీడియాతో చంద్రబాబు**



**ఏలూరు , (రాజధాని వార్తలు):** గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పోలవరానికి అభ్యంతరం చెప్పడం సరికాదని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. సముద్రంలో కలిసే నీళ్లు ఎవరైనా వాడుకోవచ్చు. నీటి విషయంలో రాజకీయాలు చేయవద్దని తెలంగాణను కోరుతున్నట్లు వెల్లడించారు. రాజకీయ నేతలు పోటీపడి మాట్లాడటం సరికాదు. అక్కడి ప్రజలు కూడా ఆలోచించాలి. తెలుగు జాతి ఒక్కటే.. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. ఇద్దరి మధ్య విరోధాలు పెరిగి ఆనందించే పరిస్థితి రాకూడదన్నారు. భావోద్వేగాలతో ఆటలు ఆడటం మంచిది కాదు. ప్రజల కోసం రాజకీయాలు చేస్తే మంచిదే. ఆర్డీఎస్‌లో నీళ్లు రాకుంటే జూరాల నుంచి నీళ్లు తెచ్చి మహబూబ్‌నగర్‌కు ఇచ్చాం. దేవాదుల, కల్వకుర్తి నేనే ప్రారంభించా. దేవాదులను మరింత ముందుకు తీసుకెళ్లండి.. ఎవరు వద్దన్నారని సూచించారు. ఈ మధ్య కొందరి మాటలు చూస్తే.. రాజకీయాలు నాకే అర్థం కాలేదు. గోదావరి నదికి ఎగువన దేవాదుల ప్రాజెక్టు ఉంది. దేవాదుల నుంచి నీళ్లు వస్తే పోలవరానికి వస్తాయి. కిందకు వచ్చే నీళ్లకు మీరు అభ్యంతరం చెబితే ఏమైనా అర్థం ఉందా అని ప్రశ్నించారు. ఆరోజు మంజీరాకు నీళ్లు తీసుకెళ్లారు.. అప్పుడు స్వాగతించాం. గోదావరి నదిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి.. పూర్తి చేసుకోండి. దేవాదులకు మేం ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకు కూడా లబ్ది కలుగుతుందని చంద్రబాబు అన్నారు.. మిగిలిన నీరు సాగర్, శ్రీశైలంలో నిల్వ చేస్తే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు పైన ప్రాజెక్టులు కడితే నష్టం. కృష్ణా డెల్టాను కాపాడి గోదావరిని అనుసంధానం చేసుకుంటే ఇబ్బంది ఉండదు. రాయలసీమ ఎత్తిపోతలపై చేసిన వ్యాఖ్యల్లో అర్థం లేదు. అబద్దాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందని భావిస్తున్నారు. సముద్రంలోకి వెళ్లే నీటిని అడ్డుకుంటే లాభాలు ఉంటాయి..నష్టాలు ఉంటాయన్నారు. గత వైకాపా ప్రభుత్వం వల్లే ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడానికి ఆరేడు ఏళ్లు ఆలస్యమైంది. ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పాకే డయా ఫ్రం వాల్ పాడైందని గత ప్రభుత్వంలోని వారికి తెలిసింది. భవిష్యత్తులో వచ్చే విపత్తులను దృష్టిలో ఉంచుకొని కొత్త డయాఫ్రం వాల్ కడుతున్నాం. ఫిబ్రవరి 15కల్లా డయాఫ్రం వాల్ పూర్తి చేస్తాం అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అనుమతులు లేని ప్రాజెక్టులు ప్రారంభించి రూ.2 వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఎన్జీటీకి రూ.100 కోట్ల జరిమానా కట్టారు. ముచ్చుమర్రి ఇప్పటికే ఉంది.. అక్కడి నుంచి నీళ్లు తెచ్చుకోవచ్చు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరుగుతోంది. కేవలం దర్యాప్తుల పేరుతోనే కాలయాపన చేస్తే చాలా కాలం పడుతుంది. వైకాపా కుప్పకూల్చిన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం అని సీఎం అన్నారు. వైఎస్ జగన్ పాలనలో జరిగిన వివిధ అక్రమాలపై విచారణకు సుదీర్ఘ సమయం పడుతుంది.. దీనికి సుమారు 30 సంవత్సరాలు పట్టే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. జగన్ అక్రమాలు ఒకటి, రెండు కాదు.. ఆయన పాలనలో వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చేశారని వ్యాఖ్యానించారు.. అయితే, ఈ కేసులను విచా రిస్తూ కాలయాపన చేయలేం అని స్పష్టం చేశారు చంద్రబాబు.. 2019లో ప్రభుత్వం మారిన నాటి నుంచి పోలవరం ప్రాజెక్టుకు అన్ని నష్టాలే జరిగాయి.. ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ కాపాడుకోవడానికి కనీస జాగ్రత్తలు తీసుకోలేకపోయారని మండిపడ్డారు సీఎం చంద్రబాబు.. ఆరు సంవత్సరాల కంటే ముందే ప్రారంభం కావాల్సిన ప్రాజెక్ట్ గత ప్రభుత్వ తప్పిదాలతో మరొక 6 ఏళ్లు ఆలస్యం అవుతుందన్న ఆయన.. బట్రెస్ డ్యామ్ పూర్తయ్యింది.. గ్యాప్ 1 జూన్‌కి పూర్తి కావాలని లక్ష్యం పెట్టుకున్నాం.. గ్యాప్ 2 పనులు 2027 జూన్ నాటికి పూర్తి అవుతాయి.. 41.15 మీటర్ల వరకు ప్రాజెక్ట్ జనవరి 2027 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం అని వెల్లడించారు. మరోవైపు, ప్రాజెక్టులపై అన్యాయం జరుగుతుందని పర్యటనలు చేస్తే నన్ను గతంలో అరెస్ట్ చేశారని గుర్తు చేసుకున్నారు చంద్రబాబు.. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత నాకంటే గౌరవం పొం దినవాళ్లు లేరన్నారు చంద్రబాబు.. ఇంకుడు గుంతలు తవ్విస్తే నన్ను ఎగతాళి చేశారు.. కానీ, గ్రౌండ్ వాటర్ రీచార్జ్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాం.. ఇపుడు గ్రౌండ్ వాటర్ పెరగం చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందని అన్నారు.. భూమినే జలాశయంగా చేసుకోవాలి అని సూచించారు.. రైతుల ఆత్మహత్యల మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్య చేసుకోవడం కరెక్ట్ కాదు. సమస్యలను తగిన విధంగా పరిష్కరించడం అవసరమని అన్నారు సీఎం చంద్రబాబు. సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేటి నుండి 'ఆవకాయ్ - అమరావతి సినిమా, కళా, సంస్కృతి, సాహిత్యోత్సవం

**- రాష్ట్ర పర్యాటక శాఖ, టీమ్ వర్క్స్ ఆర్ట్స్ సంయుక్త నిర్వహణలో 3 రోజుల పాటు ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు - తెలుగు సినిమా, సాంస్కృతిక, కళా, సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా విజయవాడలోని పున్నమి ఘాట్, భవాని ద్వీపంలో సర్వాంగ సుందరంగా వేడుకలు - కనువిందు చేయనున్న సినిమా ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, కవితా పఠనాలు, సంగీతం, నృత్యం, నాటకాలు, వర్క్ షాప్‌లు, సాంస్కృతిక భాషణలు, ఆధునిక కళా ప్రదర్శనలు - సందర్శకులకు ప్రవేశం ఉచితం - మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్ల ప్రక్రియ దిగ్విజయంగా పూర్తి చేసిన పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, అధికారులు**












**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడ నగరం అద్భుతమైన కళా సంబరానికి ఆతిథ్యం ఇచ్చేందుకు ముస్తాబైంది. సాహిత్యం, కళాకారులు, సాంస్కృతిక సంప్రదాయాలకు నిలయంగా విరాజిల్లుతోన్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఘనమైన వారసత్వాన్ని, భాషా ప్రాభవాన్ని, కళా వైభవాన్ని జరుపుకోవడానికి 'ఆవకాయ్ – అమరావతి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవం' సిద్ధమైంది.సీఎం నారా చంద్రబాబు నాయుడు చొరవతో, మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో రాష్ట్ర పర్యాటక శాఖ, 'టీమ్‌వర్క్ ఆర్ట్స్' సంయుక్తంగా తెలుగు సినిమా, సాంస్కృతిక, సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా విజయవాడ వేదికగా కృష్ణా నది తీరాన ఉన్న పున్నమి ఘాట్ మరియు భవానీ ఐలాండ్ లో నేటి (జనవరి 8) నుండి ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు 3 రోజుల పాటు (జనవరి 10 వరకు) ప్రజలను కనువిందు చేయనున్నాయి. సినిమా ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, కవితా పఠనాలు, సంగీతం, నృత్యం, నాటకాలు, వర్క్‌షాప్‌లు, సాంస్కృతిక భాషణలు, ఆధునిక కళా ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగనుంది. సందర్శకులకు ప్రవేశం ఉచితం..మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, అధికారులు ఏర్పాట్లను దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, ఎండి ఆమ్రపాలి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, టీం వర్క్స్ ఆర్ట్స్ ప్రతినిధి సయ్యద్ శ్యామ్స్ జావిద్ తదితరులు పున్నమి ఘాట్, భవాని ఐలాండ్‌లలో పర్యటించి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా హౌస్ బోట్లు, రొమాంటిక్ ఫ్లోట్ అండ్ డైన్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్‌గా ప్రారంభించిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నదీ తీరాల్లో ఈ తరహా హౌస్ బోట్స్ ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. సాంకేతికతతో కూడిన ఆర్థిక వృద్ధిని సాధిస్తూనే, రాష్ట్ర సంస్కృతిని కాపాడుకోవాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దూరదృష్టికి ఈ ఉత్సవం ఒక నిదర్శనమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో సినిమా, సాహిత్య రంగాలకు చెందిన దిగ్గజాలు, ప్రపంచవ్యాప్త కళాకారులు పాల్గొననున్నారు. ప్రధా నంగా హెరిటేజ్ వాక్‌తో పాటు ఘాట్ ఫెర్రీ ప్రయాణం, ఫుడ్ ఫెస్టివల్ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రముఖ గాయకులు జావేద్ అలీతో సంగీత కచేరి ఉండనుంది. వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు, సినిమా చర్చలు మరియు సాహిత్య గోష్టులు సందర్శకులను అలరించనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రం సాధించిన పురోగతిని, సాంస్కృతిక మూలాలను ప్రపంచానికి చాటి చెప్పేలా ఈ వేదికను రూపొందించడం విశేషం. మూడు రోజుల పాటు జరిగే ఆవకాయ్ అమరావతి ఉత్సవానికి సందర్శకులు భారీ సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పకడ్బందీ ఏర్పాట్లు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్ల ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. నిర్వాహకులు సందర్శకులకు ప్రవేశం ఉచితంగా కల్పించారు. ఈ సందర్భంగా ఉత్సవాన్ని

(మిగతా 2వ పేజీలో)

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి

**- జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి పథకం అవసరం - సీఎం చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం - ప్రతి పథకాన్ని ప్రజల వద్దకు చేర్చాలి.. జరిగే లబ్ధిని వివరించాలి - ఎంఎస్ఎంఈల మంజూరులో జాప్యం వద్దు - గతంలో జరిగిన గృహ నిర్మాణాల అవకతవకలపై విచారణ చేపట్టాలి - 3వ దిశ కమిటీ సమావేశంలో కమిటీ ఛైర్మన్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**












**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి పథకం అవసరమని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, జిల్లా అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ కమిటీ(దిశ) ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దిశ కమిటీ వైస్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి 3వ దిశ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ, నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. గృహ నిర్మాణశాఖ, పరిశ్రమలు, జాతీయ రహదారులు, ఎంఎస్ఎంఈ యూనిట్లకు పిఎంఈజిపి, ప్రధానమంత్రి విశ్వకర్మ, ముద్ర రుణాల మంజూరు, పశుసంవర్ధకశాఖ, వైద్యారోగ్య శాఖలపై చర్చించారు. జిల్లాలో ఎంఎస్ఎంఈల స్థాపన, వాటి స్థితిగతులపై ఆరా తీశారు. రుణాల మంజూరులో జరుగుతున్న ఆలస్యంపై ప్రశ్నించారు. ఎంఎస్ఎంఈల మంజూరుకు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారుల స్థితిగతులు, పెండింగ్ పనులు, ఫ్లై ఓవర్ల ప్రస్తుత స్థితిపై ఆరా తీశారు. పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం పలు పథకాల ద్వారా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అనేక పథకాలపై ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అవగాహన ఉండడం లేదన్న ఎంపీ, జిల్లాస్థాయిలో, మండల స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు సూచించారు. వ్యవసాయ రంగంలో పదిలక్షల విలువైన డ్రోన్ పరికరాల కొనుగోలుకు కూడా కేంద్రప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. పెద్దఎత్తున జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు 1 లక్ష కోట్ల విలువైన జాతీయ రహదారులను సాధించారని, అప్పటికప్పుడు 15 వేల కోట్లును మంజూరు చేయించారన్నారు. పరిశ్రమల స్థాపనకు ఎటువంటి గ్యారంటీలు లేకుండా రూ. 2కోట్ల వరకు రుణం ఇచ్చే అవకాశం కేంద్రప్రభుత్వం కల్పించిందన్నారు. పిఎం విశ్వకర్మ ద్వారా చేతివృత్తులకు రుణాలు మంజూరు చేస్తూ ఆయా వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుని జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగ్రామిగా నిలపడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేయాలని ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడా అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. పథకాల అమలులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇప్పటికే రెండు సమావేశాలు నిర్వహించుకున్నామని, ప్రతి సమావేశానికి తప్పకుండా పురోగతి ఉండాలన్నారు. నెల్లూరు జిల్లా అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారుచేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకర్లు పరిశ్రమల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయాలని సూచించారు. నెల్లూరులోని బీసీ భవన్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు రూ. 4.50కోట్లు ఖర్చవుతుండగా మంత్రి నారాయణ రూ.కోటి రూపాయలు అందిస్తామని తెలిపారని, మిగిలిన నిధులను తాను, ఎంపీ వేమిరెడ్డి ఎంపీ నిధుల ద్వారా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ జిల్లా గృహనిర్మాణాల్లో అనేక అక్రమాలు జరిగాయన్నారు. జిల్లాలో నాణ్యతగా లేని 195 ఇళ్లను ధ్వంసం చేసి మళ్లీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నిర్మాణాలు సరిగాలేని ఇళ్లకు మరమ్మతులు చేయించాలన్నారు. ఇందుకు స్పందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హౌసింగ్ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. నెల్లూరు బుజబుజనెల్లూరు నుంచి పెన్నా బ్రిడ్జి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలను నివారించవచ్చని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజాప్రతినిధులకు సరైన అవగాహన ఉండడం లేదని, పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అండర్‌పాస్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. నేషనల్ హైవే నిర్మించి 22 సంవత్సరాలు పూర్తయినా అండర్‌పాస్ ఇంకా నిర్మించలేదని, చాలా రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు స్పందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టెండర్లు కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు మొదలు కానున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలో అధికంగా ఉత్పత్తి అయ్యే వేరుశనగ, నిమ్మ పంటలకు అనుగుణంగా విలువ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే గృహ నిర్మాణాల్లో గుర్తించిన లోపాలపై ఇప్పటికే పునర్నిర్మాణం, మరమ్మతు పనులు ప్రారంభించామని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇవో శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ సిఇవో మోహన్‌రావు, ఎపిఐఐసి జడ్ఎం శివకుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత, వ్యవసాయ శాఖ జెడి సత్యవేణి, ఎన్‌హెచ్ పిడి ఎం చౌదరి, పశుసంవర్ధకశాఖ జెడి రమేష్‌నాయక్, వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు, జడ్పీటీసీలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి 'ఆవకాయ్ - అమరావతి సినిమా, కళా, సంస్కృతి, సాహిత్యోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం చేయాలని పర్యాటక శాఖ పిలుపునిచ్చింది. నేడు (జనవరి 8) సాయంత్రం 4.45 గం.లకు భారీ తోలుబొమ్మలాట, డ్రమ్స్ ప్రదర్శనతో ప్రారంభోత్సవం ఊరేగింపు కార్యక్రమం జరుగు తుంది. అనంతరం జమ్మెర్స్ వారిచే సంగీత ప్రదర్శన, పున్నమి ఘాట్ దగ్గర హారతి కార్యక్రమం ఉంటుంది. ఒమాజియో పెర్ఫార్మింగ్ కంపెనీ వారి హర్ ఫ్రేమ్స్, హర్ ఫైర్ కార్యక్రమం ఉండనుంది. అనంతరం 7.50 గం.లకు ముఖ్య అతిథులతో ఉత్సవం ప్రారంభం అవుతుంది. కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, యూరోపియన్ యూనియన్ రాయబారి హెచ్.ఇ.హెర్వే డెల్ఫిన్, టీమ్ వర్క్ ఆర్ట్స్ పాలనాధికారి సంజయ్ కె.రాయ్ పాల్గొననున్నారు. ఆ తర్వాత రాత్రి 8.30 నుండి 10 గం.ల వరకు ప్రేమకథ సంగీత నాటకంతో తొలిరోజు కార్యక్ర మం ముగుస్తుంది.రెండవ రోజు (జనవరి 9) ఉదయం 11 గం.ల నుండి భవానీ ఐల్యాండ్‌లో, సాయంత్రం 5 గం.ల నుండి పున్నమి ఘాట్‌లలో వేడుకలు జరుగనున్నాయి. భవానీ ద్వీపంలో సినిమాల్లో ప్రతినాయకుల పాత్రపై జరిగే చర్చలో ఎస్.హుస్సేన్ జైదీ, యండమూరి వీరేంద్రనాథ్, సుధీర్ మిశ్రాలు పాల్గొంటారు. అదేవిధంగా తుహోన్ ఆదిత్యరాయ్‌తో మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గం.లకు భారతీయ పురాణాలు, కథ చెప్పే విధానంలో పరిణామ క్రమం అంశంపై బ్నిం, కస్తూరి మురళీకృష్ణ, సంజీవ్ పన్రిచా, మొతాలీ అనురాధలు సంభాషిస్తారు. ప్రముఖ నగాడా వాయిద్య కారులు నాథులాల్ సోలంకితో నగడా శిక్షణా శిబిరం నిర్వహిం చబడుతుంది. మధ్యాహ్నం స్టోరీ అవర్ యూకే వారిచే సంగీత, మాటలతో సార్వత్రిక కథలపై కథా కాలపేక్షం నిర్వహించనున్నారు. ప్రముఖ తోలుబొమ్మలాట కళాకారుడు షమీమ్‌తో తోలుబొమ్మల తయారీలో శిక్షణ ఉంటుంది. ఓటీటీ యుగంలో సినిమా అంశంపై లీనా యాదవ్, శిబిశిష్ సర్కార్, సౌగుట ముఖర్జీ, సుప్రియ యార్లగడ్డ, సునీల్ చైనాని, శ్రీరూపా మిత్ర చర్చిస్తారు. ప్రఖ్యాత ఫ్రెంచ్ నృత్య కళాకారులు గిల్లెస్ చుయెన్‌తో డాన్స్ శిక్షణా శిబిరం నిర్వహిస్తారు. నవల నుండి సినిమా వరకు వల్లి పద్మాంజలితో యండమూరి వీరేంద్రనాథ్, ఎ.కోదండరామి రెడ్డి సంభాషిస్తారు. అనంతరం సాయంత్రం గం.ల నుండి పున్నమి ఘాట్‌లో చందన బాల కళ్యాణ్‌చే కర్ణాటక, అధ్యాత్మిక సంగీత విభావరి జరుగనుంది. ఆ తర్వాత వనశ్రీ రచించిన 'రస' ఐక్యం కూచిపూడి నృత్యం నాటకీయ కథ ప్రదర్శించబడుతుంది. శ్యామ్ రక్షంద జలీల్‌తో ప్రియ సారయ్యా, శేఖర్ రావ్జాని, కాసర్ల సంభాషణ, ప్రియ సరైయలతో సినిమాల్లో సంగీతం, కవిత్వం అంశంపై చర్చ జరగనుంది. అనుభూతినిచ్చే ముషైరా పై అజర్ ఇక్బాల్, ఇక్బాల్ అష్హర్, ఖుష్బీర్ సింగ్ షాద్, డా.నుస్రత్ మెహదీ, పాయల మురళీకృష్ణ, పాపులర్ మెరతి, సైఫ్ నిజామి, సర్దార్ ఖలీమ్‌లు చర్చించనున్నారు. అనంతరం ఆజ్ రంగ్ హై కె.శ్రీనివాసరావు, ఆచార్య జయప్రద, ఆచార్య తడకమళ్ల విజయ్ కుమార్‌లచే సంగీత విభావరి ఉండనుంది. మూడవ రోజు (జనవరి 10) కథా కాలక్షేపంతో పాటు నీటిపై రాతలు అంశంపై తెలుగులో కథ చెప్పే కళశ్రీ కరుణతో బ్నిం, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డితో చర్చా కార్యక్రమం ఉంటుంది. సినిమా మరియు పాత్రికేయ వృత్తి అంశంపై చల్లా భాగ్యలక్ష్మీతో వర ముళ్లపూడి, వడ్డి ఓం ప్రకాష్ నారాయణల మధ్య సంభాషణ ఉంటుంది. తెలుగు సాహిత్యం, సినిమా వైభవంపై మోతాలీ అనురాధతో కస్తూరి మురళీకృష్ణ, మామిడి హరికృష్ణ, శ్రీపతి వర్మ వేదాంతంల మధ్య సంభాషణ ఉంటుంది. అనంతరం పదాలకు సరిహద్దులు లేవు అనే అంశంపై చర్చ ఉంటుంది. సాయంత్రం పున్నమి ఘాట్‌లో చౌరస్తా వారిచే సంగీత ప్రదర్శన, టి.డి జనార్ధన్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, బుర్రా సాయి మాధవ్, తేజస్వి పొడపాటి చేతుల మీదుగా నట సార్వభౌమ ఎన్టీఆర్ నట విశ్వరూపానికి నివాళులు అర్పించే కార్యక్రమం జరుగనుంది. ఆ తర్వాత ప్రేమ కథా సంగీత నాటకం ప్రదర్శన అనంతరం 9 గం.లకు ఉత్సవం ముగుస్తుంది. పున్నమి ఘాట్‌లో రాత్రి 11 గం.లకు కార్యక్రమం పరిసమాప్తమవుతుంది.

# మెడికల్ కాలేజీల పీపీపీ అంశంలో కీలక మలుపు.. హైకోర్టులో వైసీపీ పిల్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీలోని 17 మెడికల్ కళాశాలలను పీపీపీ ద్వారా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీటిని పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలని కోరుతూ ఏపీ హైకోర్టులో వైసీపీ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఇవాళ న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. ప్రజలకు ఉచితంగా, మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ఈ మెడికల్ కళాశాలలను తాము ఏర్పాటు చేశామని వైసీపీ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థల జోక్యం ఉండకూడదని, అలా జరిగితే పేదలకు వైద్య విద్యా అవకాశాలు దూరమవుతాయని ఆ పార్టీ వాదిస్తోంది. అప్పటి ప్రభుత్వం ఈ కళాశాలల నిర్వహణకు బడ్జెట్ భారం లేకుండా చూసుకునేలా విధానాలు రూపొందించిందని, కొన్ని సీట్లను మాత్రమే డొనేషన్‌కు కేటాయించి ఆ ఆదాయాన్ని ఆసుపత్రుల అభివృద్ధికి వినియోగించేలా మార్గదర్శకాలు తయారు చేసిందని కోర్టుకు పిల్‌లో వివరించింది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో ఈ కళాశాలలను నడిపిస్తే వైద్య విద్య మాత్రమే కాకుండా, సామాన్యులకు వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండవని, అవి కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని వైసీపీ తన పిల్‌లో ఆందోళన వ్యక్తం చేసింది.




ప్రభుత్వం చెబుతున్నట్టు ఆర్థిక భారం ఎక్కువగా ఉందన్నది వాస్తవం కాదని, ఇందుకు సంబంధించి ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి కోటి సంతకాలు సేకరించామని కూడా కోర్టుకు తెలిపింది. టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేసింది. ప్రతి వాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఎంఎస్ఐడీసీ, ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌లను వైసీపీ చేర్చింది.

# కేజీబీవీ విద్యార్థినుల వెతలు తీర్చిన విపిఆర్

**- ఇచ్చిన హామీ మేరకు కేజీబీవీకి ఇన్వర్టర్ల అందజేత - ఇటీవల పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎస్ పేట కేజీబీవీకి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి - త్వరలో పరీక్షలు ఉండగా.. విద్యుత్ సమస్యలున్నాయని తెలిపిన విద్యార్థినులు - వెంటనే స్పందించిన ఎంపీ.. సొంత నిధులతో ఇన్వర్టర్ల ఏర్పాటు - ఎంపీకి ధన్యవాదాలు తెలియజేసిన పాఠశాల విద్యార్థినులు, సిబ్బంది తదితరులు**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట ఇస్తే.. తప్పకుండా ఆదుకుంటారని మరోసారి రుజువైంది. కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు చెప్పగానే స్పందించి ఇన్వర్టర్లు ఏర్పాటు చేయించి వారి వెతలు తొలగించారు. గత నెల 31వ తేదీన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గారితో కలిసి ఏఎస్‌పేట మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పర్యటిస్తున్న సందర్భంలో విద్యార్థినులతో ఎంపీ వేమిరెడ్డి, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ముచ్చటించారు. ఈ సందర్భంగా తాము కరెంట్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరలో పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా ఇన్వర్టర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

వెంటనే స్పందించిన ఎంపీ వేమిరెడ్డి.. నాడు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తమ సిబ్బందిని పంపి ఎస్టిమేషన్ వేయించారు. ఉన్న గదులకు ఎంత కెపాసిటీ సరిపో తుందో ఆరా తీయించారు. దాంతో 100 లైట్లు, 32 ఫ్యాన్లు పనిచేసేలా 2 ఇన్వర్టర్లు, 8 బ్యాటరీలు పాఠశాలలో ఇన్స్టాల్ చేయించి విద్యార్థినుల సమస్యలను పరిష్కరించారు. ఈ సం దర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బి.శ్రీలక్ష్మి, అధ్యాపకులు, అధ్యా పకేతర సిబ్బంది, విద్యార్థినులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అడిగిన వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించారని అన్నారు.

# చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సునీల్ కుమార్

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు నియోజకవర్గ చిల్లకూరు మండలం ఓడూరు గ్రామంలో రాష్ట్ర లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, శ్రీనివాసులు దంపతుల కుమారుడి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొని ఆశీర్వదించి జన్మదిన శుభాకాం క్షలు తెలిపారు. ముందుగా జన్మదిన కేకును కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువులో ప్రతిభ చూపి ఉన్నత లక్ష్యాన్ని నెరవేర్చాలని దీవించారు. ఈ కార్యక్రమం లో తిరుపతి పార్లమెంటు జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, టిడిపి మహిళా నాయకులు శ్రీదేవి, పాల్గొన్నారు.



# భోగాపురం ఎయిర్‌పోర్ట్ జగనన్న విజన్: ఆ ఘనత జగన్మోహన్ రెడ్డిదే: చిన్నశ్రీను



**విజయనగరం, (రాజధాని వార్తలు):** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంపై తెలుగుదేశం పార్టీ చేస్తున్నవన్నీ అసత్య ప్రచారాలని, ప్రాజెక్టు క్రెడిట్‌ను దొంగిలించేందుకు పడుతున్న తాపత్రయం హాస్యాస్పదమని వైఎస్ఆర్సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షులు, జెడ్పీ చైర్మన్ మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను ధ్వజమెత్తారు. ధర్మపురిలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో చంద్రబాబు నాయుడు ఎయిర్‌పోర్ట్ పేరుతో వేలాది ఎకరాల భూములను కొట్టేయాలని చూశారని చిన్న శ్రీను ఆరోపించారు. అమరావతి, హైటెక్ సిటీ తరహాలోనే ఇక్కడ కూడా 15,000 ఎకరాలను సేకరించాలని ప్రయత్నించి రైతులను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. ఆనాడు రైతుల పక్షన నిలబడి వైఎస్ జగన్ చేసిన పోరాటం వల్లే బాబు వెనక్కి తగ్గాల్సి వచ్చిందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్ జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆయన కృషితోనే ఈరోజు రన్‌వేపై ఫ్లైట్ ల్యాండ్ కాగలిగిందని చిన్న శ్రీను పేర్కొన్నారు. ఈ విజయం ఉత్తరాంధ్ర ప్రజలందరికీ గర్వకారణమని, ప్రజలందరికీ ఈ విషయం అర్థమైందని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఎక్కడ టెంకాయ కొట్టారో కూడా తెలియని పరిస్థితిలో టీడీపీ నాయకులు ఉన్నారని, కేవలం పబ్లిసిటీ కోసం అప్పట్లో జిమ్మిక్కులు చేశారని మండిపడ్డారు. జగన్ అధికారంలోకి వచ్చాక కేవలం 2,200 ఎకరాల్లో విమానాశ్రయాన్ని నిర్మించాలని నిర్ణయించి, భూసేకరణ, నో అబ్జెక్షన్ సర్టిఫైట్, కోర్టు కేసులు మరియు పరిహారం వంటి అన్ని అడ్డంకులను తొలగించారని వివరించారు. జగన్ చేసిన కృషిని తమ ఖాతాలో వేసుకోవాలని టీడీపీ చూస్తోందని, అయితే వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా ధాటికి వారి క్రెడిట్ చోరీ ప్రయత్నాలు ఫలించలేదని పేర్కొన్నారు. జిఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని, 2026 నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారని తెలిపారు. ఈ విషయాన్ని స్వయంగా జిఎంఆర్ అధినేత కూడా స్పష్టం చేశారని గుర్తు చేశారు. అన్ని అనుమతులు తీసుకు వచ్చి, ఉత్తరాంధ్ర తలరాతను మార్చే ఈ మహత్తర ప్రాజెక్టును పట్టాలెక్కించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్తశుద్ధిని, ఇచ్చిన మాట ప్రకారం ఎయిర్ పోర్ట్ పనులను సకాలంలో, వేగంగా పూర్తి చేస్తున్న జిఎంఆర్ సంస్థకు మరియు ఆ సంస్థ అధినేతకు ఈ సందర్భంగా చిన్న శ్రీను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మీడియా సమావేశంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శులు వి సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, మండలపార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, పతివాడ అప్పలనాయుడు, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి

**- శివారు ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు చేయడం అభినందనీయం - దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు పూజల లక్ష్మి - భద్రాచలం ఏఎస్పీని అభినందించిన దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్**




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలంలో గత సంవత్సర కాలంగా అసాంఘిక శక్తులు పేట్రేగిపోతూ దాడులు హత్యల వరకు వెళ్తున్నారని వారి పట్ల పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరించాలని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు పూజ లక్ష్మి కోరారు. మంగళవారం భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల రాజుపేట జగదీష్ కాలనీ ఏఎంసీ కాలనీలలో అకస్మాత్తుగా తనిఖీలు చేసి అనుమానితులను అదుపులో తీసుకోవడం ద్వారా ప్రజలకు మనో ధైర్యం కలిగిందని అన్నారు. ఇటువంటి తనిఖీలు పట్టణ వ్యాప్తంగా ఉన్నటువంటి శివారు కాలనీలలో నిర్వహించాలని కోరారు. భద్రాచలం శాంతి భద్రతల పట్ల ఎస్పీ తీసుకున్న చొరవను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. పట్టణంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెట్టడం వల్ల మద్యం యువకులకు విచ్చలవిడిగా అందుబాటులోకి వస్తుందని ఆ కారణంతోనే మద్యం మత్తులో యువకులు చనికావేశంలో అనేక రకాల తప్పులకు పూనుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మద్యంతోపాటు గంజాయి వంటి మత్తు పదార్థాలను యువతకు అందకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా యువకులకు ప్రత్యేక సెమినార్లు నిర్వహించి యువకులను చైతన్యవంతులు చేసి మత్తు పానీయాల వైపు వెళ్లకుండా చూడాలని కోరారు. ఇటీవల కాలంలో మహిళలు యువతులు సైతం సాయంత్రం ఏడు దాడితే బయటికి రావాలంటే భయపడాల్సిన పరిస్థితి వస్తుందని వీటికి ప్రధాన కారణం మత్తు పదార్థాలేనని అని అన్నారు. దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు సాంస్కృతిక క్రీడా పోటీలను సైతం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు భద్రాచలం మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వేగం వినాశనం, జాగ్రత్త విజయం: భద్రాద్రి కొత్తగూడెం ఆర్‌టీఓ






**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా స్థానిక రాంనగర్‌లోని ఎస్ఆర్ డిజి పాఠశాలలో ఏర్పాటు చేసిన సడక్ సంరక్షణ అభియాన్ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్ టి ఓ భూషిత్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు రోడ్డు భద్రత విద్య గురించి రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని, మనం చేసే చిన్న తప్పు మనతోపాటుగా మన ఎదు రుగా వస్తున్న వారి ప్రాణాలకు కూడా ముప్పు అని, ట్రాఫిక్ నియమాలను పాటించడం మనందరి బాధ్యత అని తెలియ జేశారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, హెల్మెట్‌ను వాడకపోవడం, అనేవి ప్రమా దాలకు కారణం అవుతాయని తెలియజేశారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జనవరి మాసంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించడం ద్వారా విద్యార్థి దశ నుండే రోడ్డు భద్రతపై, ట్రాఫిక్ నియమాలపై అనేక విషయాలు విద్యార్థులకు అవగతమ వుతుందని ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఒక మంచి పరిణామమని కొనియాడారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల 1.75 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని ఇటువంటి వాటి వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తున్నాయని వీటి నివారణకు మనందరం ట్రాఫిక్ నియమాలను పాటించాలని విద్యార్థులను వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఏదో ఒక సంతోషకర సందర్భాన్ని పురస్కరించుకొని తమ తల్లిదండ్రులకు ఒక హెల్మెట్‌ను బహుమానంగా అందిస్తే అది కుటుంబానికి భద్రతగా నిలుస్తుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ కొత్తగూడెం జోనల్ ఇంచార్జ్ సతీష్ మాట్లాడుతూ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ సమాజానికి అవసరమయ్యే ఇటువంటి మంచి కార్యక్రమాల్లో ముందు నిలబడి భావితరాలకు ఒక గొప్ప సందేశాన్ని తోడ్పాటును అందిస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు వెంకటరమణ, మనోహర్, ఎఎంవిఐలు ప్రకాష్, అశోక్, శ్వేత, మానస, ఎస్ ఆర్ డిజి పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల్ రెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాఠశాల డ్రైవర్లు,హెల్పర్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తోష్ణీవాల భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన ధనుర్మాస సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా శాసనసభ మాజీ ఉపసభాపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కోలగట్ల వీరభద్ర స్వామి ఆయన కుమార్తె వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగర మున్సిపల్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు. వీరిని సంఘ సభ్యులు ఘన స్వాగతం పలికి, ఉచిత రీతిన సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వీకులు అలవర్చిన సేవా భావాన్ని నేటితరం ఆర్యవైశ్యులు కూడా కొనసాగించడం ఎంతైనా అభినందనీయమని అన్నారు. ధనుర్మాస సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఎడ్ల బళ్ళు, భోగి మంటలు, హరి కథ, చిలక జోస్యం, పిండి వంటలు సాంప్రదాయ బద్ధమైన ఏర్పాట్లు, కళ్ళకు పండగ వాతావరణం కనబరిచేలా చిత్రీకరిం చిన సెట్టింగులు అందర్నీ ఆకట్టుకునేలా ఉన్నాయని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం స్థాపించి 92 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 92 రకములైన పప్పు దినుసులను, నిత్యవసర వస్తువులను 92 మంది నిరుపేద ఆర్య వైశ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు రవ్వ శ్రీనివాసరావు, అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కుమ్మరిగంటి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు చెరుకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం



**బొండపల్లి,(విజయనగరం) (రాజధాని వార్తలు):** జిల్లాలోని రైస్ మిల్లర్లపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన బొండపల్లిలోని లక్ష్మనారాయణ మోడరన్ రైస్ మిల్లును మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యాన్ని మర పట్టి ప్రభుత్వానికి అప్పగించడంలో తీవ్ర నిర్లక్ష్యన్ని ప్రదర్శిస్తున్నారని మంత్రి అసహనాన్ని వ్యక్తం చేశారు. సీఎంఆర్ విషయంలో ఎందుకు వెనుకబడ్డారని నిలదీశారు. ఇప్పటికి కేవలం 17 శాతం మాత్రమే పూర్తి చేయడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. బ్యాంకు గ్యారంటీల విషయంలో కూడా జిల్లాలోని మిల్లర్లకు వెసులుబాటు ఇచ్చామని, అయినప్పటికీ మిల్లింగ్ విషయంలో పెద్దగా శ్రద్ధ చూపడం లేదని అన్నారు. రోజుకి 150 ఏసికేల చొప్పున మిల్లింగ్ చేయాలని, ఈ నెల 8వ తేదీలోగా 45,000 మెట్రిక్ టన్నులు పూర్తి చేయాలని మిల్లర్లను మంత్రి ఆదేశించారు. గోదాములు, నిల్వ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని, ఎఫ్సిఐ అంశాన్ని కూడా పరిష్కరించామని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్యూ ఆర్ కోడ్ ప్రవేశపెట్టి దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి మనోహర్‌తో బాటు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండి ఎస్. ఢిల్లీరావు, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, డిసిఎంఎస్ చైర్మెన్ గొంప కృష్ణ, జెసి సేధు మాధవన్, ఇతర అధికారులు, కూటమి నాయకులు, మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరావు తదితరులు ఉన్నారు.

# ఈనాడు మహిళా క్రికెట్ లీగ్‌లో విన్నర్స్‌గా నిలిచిన సీతం కళాశాల మహిళా జట్టు






**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా క్రిట్ లీగ్‌లో సీతం కళాశాల మహిళా క్రిట్ జట్టుగా విన్నర్స్‌గా నిలిచినట్టుగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి. రామమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలు విజయనగరం విజ్జి స్టేడియంలో జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఈ పోటీలు ఈనాడు సంస్థ మొదటిసారి నిర్వహించడం సీతం కళాశాల మహిళా జట్టు మొదటి స్థానంలో ఉండడం, నగదు బహుమతి కూడా పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రీడాభినందన సభలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిఎస్ఓ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు జె.మహేశ్వరరావు, శ్రీదేవి, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

# భద్రాచలం గర్వించదగ్గ ప్రతిభ మిస్ టీన్ తెలంగాణ - ప్రీతి యాదవ్‌కు ఘన సన్మానం

**- హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్: వ్యవస్థాపకులు అల్లాడి వెంకటేశ్వరరావు**




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పట్టణానికి చెందిన యువతి ప్రీతి యాదవ్ ఇటీవలే మిస్ టీన్ తెలంగాణ కిరీటాన్ని కైవసం చేసుకుని జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన విజయాన్ని అభినందిస్తూ, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అల్లాడి వెంకటేశ్వరరావుతో పాటుగా హ్యూమన్ రైట్స్ టీం ఆమెను ఘనంగా సన్మానించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో అల్లాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతం నుండి వెళ్లి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన ప్రీతి యాదవ్ యువతకు ఆదర్శమని కొనియాడారు. భద్రాచలం వంటి పుణ్యక్షేత్రం నుండి ఇలాంటి ప్రతిభావంతులు వెలుగులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రీతి యాదవ్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ప్రోత్సాహం భవిష్యత్తులో ఆమె మరిన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ ప్రతినిధులు, ప్రీతి యాదవ్ కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొని ఆమెకు అభినందనలు తెలియజేశారు. తన విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు, తనను ప్రోత్సహిస్తున్న పెద్దలకు ప్రీతి యాదవ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# సంపాదకీయం

## అమెరికా ఆధిపత్యానికి తలొగ్గడమా

'నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి' అని మహాకవి శ్రీశ్రీ ఏనాడో ఘోషించారు. సామ్రాజ్యవాదం కొనసాగుతున్నంతకాలం ప్రపంచ చరిత్రలో ఆ నగ్న సత్యం స్థిరంగా ఉంటుందనడంలో సందేహం లేదు. గత వారం వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణిని అర్థరాత్రి పూట అమెరికా దళాలు అపహరించి తమ దేశానికి తరలించిన తీరు ఎవరికైనా ఒళ్లు గగుర్పొడిపింపచేసే ఘట్టం. ఇది వెనెజువెలాపై యుద్ధం కాదని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ఆ దేశాధ్యక్షుడిపై అమెరికా చట్టాల ప్రకారం చేపట్టిన చర్య మాత్రమేనని, ఆ దేశాన్ని ఆక్రమించుకోవడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో, అమెరికా చమురు కంపెనీలు వెనెజువెలాలో ప్రవేశించి వందలకోట్ల డాలర్లతో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాయని కూడా ఆ పెద్ద మనిషి ప్రకటించారు. రాజకీయ సుస్థిరత నెలకొనేవరకు వెనెజువెలాను తామే నడిపిస్తామని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. నిజానికి గత ఆగస్టు నుంచీ అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు వెనెజువెలా చుట్టూ మోహరిస్తూ విధ్వంసక దాడులు చేస్తూనే ఉన్నాయి. అయినా గత వారాంతంలో వెనెజువెలాకు వ్యతిరేకంగా తాము చేసింది యుద్ధం కాదని ట్రంప్ నిస్సిగ్గుగా ప్రకటించారు. వెనెజువెలా చమురు నిల్వలపై దృష్టి పెట్టినందువల్లే అమెరికా ఆ దేశాధ్యక్షుడిని అపహరించిందన్న విషయం ప్రపంచంలో ఎవరూ కాదనలేని వాస్తవం. చమురు తవ్వకాలను ప్రభుత్వ రంగంలో నిర్వహించడమే కాకుండా ఆ సహజ సంపదను డాలర్ ధరలకు కాకుండా ఇతర దేశాలకు, ముఖ్యంగా చైనాకు విక్రయించుకోవడాన్ని అమెరికా సహించలేకపోయింది. గతంలో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ తమ పెట్రోలియం ఉత్పత్తులను డాలర్ ధరలకు కాకుండా యూరోలకు అమ్ముకున్నప్పుడు కూడా అమెరికా ఇదే విధంగా వ్యవహరించింది. 2003లో ఇరాక్ ను ఆక్రమించిన తర్వాత అమెరికా తొలుత చేసిన పని ఇరాకీ చమురును మళ్లీ డాలర్లకు అమ్ముకోవడమే. నిజానికి ఇరాక్ రసాయన ఆయుధాలు తయారు చేస్తున్నదన్న నెపంతో అమెరికా ఆ దేశాన్ని దురాక్రమించింది. అయితే ఇరాక్‌లో మూకుమ్మడి మారణాయుధాలు ఉన్నట్టు ప్రపంచానికి రుజువు చేయలేకపోయింది. డాలర్‌కు బదులు ప్రత్యామ్నాయ కరెన్సీ గురించి యోచించినందువల్లే మానవత్వ పరిరక్షణ పేరుతో లిబియా అధినేత గడాఫీని ఊచకోత కోసి ఆ దేశాన్ని సర్వనాశనం చేసేంతవరకూ అమెరికా ఊరుకోలేదు. వెనెజువెలా కూడా డాలర్‌తో నిమిత్తం లేకుండా రకరకాల కరెన్సీల్లో, బార్టర్ పద్ధతుల్లో చమురు అమ్మడం ప్రారంభించింది. చైనాకు ఆ దేశ కరెన్సీ యువాన్‌లోనే చమురు అమ్మింది. దీనితో మాదకద్రవ్యాల ఉగ్రవాదం, నియంతృత్వం, ప్రజాస్వామ్యం పేరుతో అమెరికా వెనెజువెలా అధ్యక్షుడిని అపహరించింది. నిజానికి ప్రపంచంలో చాలా దేశాలు ఇప్పుడు డాలర్ ఆర్థిక శృంఖలాల నుంచి విముక్తి పొందాలని ఆలోచిస్తున్నాయి. భారత్ ఈ విషయంలో ఒక అడుగు ముందుకు వేసి రూపాయి ధరకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. అయితే తాము సాంకేతిక సర్దుబాట్లు మాత్రమే చేసుకున్నామని, డాలర్ ఆధిపత్యాన్ని ప్రశ్నించడం లేదని న్యూఢిల్లీ సర్దిచెబుతోంది. డాలర్ ఆధిపత్యం కూలిపోవడాన్ని అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. డాలర్ ఆధిక్యతను తగ్గించే ఏ అంతర్జాతీయ చట్టాలను, సార్వభౌమాధికారాలను అమెరికా సహించదు. తమ ఆర్థిక ఆధిపత్యాన్ని ఆమోదించినంతమేరకే అమెరికాకు ఏ దేశంతోనైనా స్నేహం. లేకపోతే ఇరాన్, లిబియా, వెనెజువెలా లాగా క్రూరమైన అణిచివేతలకు గురి కావల్సి వస్తుంది. ఆంక్షలు, తిరుగుబాట్లు, సైనిక చర్యలు చేపడతామన్న హెచ్చరికలతో వెనెజువెలాలో అల్లకల్లోలం సృష్టించిన తర్వాతే అమెరికా గత శనివారం అర్ధరాత్రి రంగంలోకి దిగింది. చైనా రాయబారితో వెనెజువెలా అధ్యక్షుడు మదురో చర్చలు జరిపి ఆ దేశంతో తమకు బలమైన సంబంధాలు ఉన్నాయని ప్రకటించిన మూడుగంటల్లోనే అమెరికా సైనిక దళాలు ఆయనను అపహరించి తమ దేశానికి తీసుకు వెళ్లాయి. అసలు ఒక దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదో లేదో, అక్కడ ఎన్నికలు సక్రమంగా జరుగుతున్నాయో లేదో నిర్ధారించే హక్కు అమెరికాకు ఎక్కడిది? నిజానికి ఎన్ని అప్రజాస్వామిక, నియంతృత్వ దేశాలతో అమెరికా సంబంధాలు కొనసాగించడం లేదు? అమెరికా న్యాయస్థానాలే ప్రపంచ కోర్టుల్లాగా వ్యవహరించడం సబబేనా? ప్రపంచ దేశాల మధ్య శాంతిని సంరక్షించడం ఐక్యరాజ్యసమితి విధ్యుక్త ధర్మం. మరి వెనెజువెలాపై అమెరికా ఆగడాన్ని ఆపలేకపోయినప్పుడు సంస్థ ఉనికికి ఏమైనా అర్థం ఉన్నదా? ఒక దేశ పాలకులను ఆ దేశ ప్రజలే నిర్ణయించాలన్న ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ఒడంబడికకు అర్థం ఏమైనా ఉన్నదా? అమెరికా ఎప్పుడూ ఈ నిబంధనలను పాటించలేదు. 1989లో పనామా అధ్యక్షుడు నొరెగాను బుష్ ప్రభుత్వం ఇదే విధంగా బంధించి తమ దేశానికి తీసుకు వెళ్లింది. ప్రపంచంలో అనేక దేశాల్లో నాయకత్వ మార్పులకు, విధ్వంసకాండలకు పూనుకున్న అమెరికా ప్రపంచానికి ప్రజాస్వామ్య పాఠాలు నేర్పుతూ ఉంటుంది. 2011లో సీనియర్ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ నేతృత్వంలో పాకిస్థాన్ వెళ్లిన బృందానికి అమెరికా విశ్వరూపం కనిపించింది. ఆ దేశంలో సీఐఏ ఏజెంట్ రేమండ్ డేవిస్ తన కారు వెనుక వస్తున్న ఇద్దరు పాకిస్థానీ యువకులను అనుమానించి ఉత్తి పుణ్యాన కాల్చి చంపాడు. ప్రజలు తీవ్ర నిరసన తెలిపేసరికి అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. క్షణాల్లో అమెరికా ప్రత్యేక విమానం లాహోర్‌లో దిగింది. లాహోర్ జైలులోనే విచారణ జరిపించి అతడిని విడుదల చేశారు. ఆ యువకుల కుటుంబ సభ్యులకు బ్లడ్ మనీ చెల్లించి అమెరికాలో ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేశారు. అదే ప్రత్యేక విమానంలో రేమండ్ డేవిస్‌తో పాటు వారిని కూడా అమెరికాకు తీసుకు వెళ్లారు.

# మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వాసుపల్లి భరోసా

**- పిల్లల చదువు నిమిత్తం ఆర్థిక సహాయం - వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రజలతో మమేకం అవుతూ, ప్రజా సమస్యలపై స్పందిస్తూ,వారి సమస్యలను తన సమస్యలుగా భావించి, ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ, తమ కుటుంబంలో ఒక పెద్ద కొడుకుగా బాధ్యతలు నిర్వహిస్తున్న విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తన సొంత నిధులు వినియోగించి, నిస్వార్థ సేవలతో ప్రజల కష్టాలను తీరుస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్‌ను ప్రజల తమ గుండెలలో చిరస్థాయిగా నిలుపుకున్నారు.ప్రజాసేవకే తన జీవితం అంకితం అనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్న ఆయనకు ప్రజల నుంచి కూడా విశేష స్పందన వస్తుంది. ఈ క్రమంలో ఉన్న ఆయన 38వ వార్డు సీతారాం స్వామి టెంపుల్ స్ట్రీట్‌లో నివసించే తామరపల్లి శేఖర్ మృతి చెందడంతో అతని కుటుంబానికి అండగా నిలిచారు.వారి పిల్లల చదువు నిమిత్తం తక్షణమే రూ. 5000/- శేఖర్ భార్య అనంతలక్ష్మికి అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంచి చేయాలంటే పదవులు అవసరం లేదని, మంచి మనసు ఉంటే చాలని వాసుపల్లి గణేష్ కుమార్ నిరూపించారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. నేడు కూడా ఆయన ప్రజలకు సేవ చేసేందుకు వెనకడుగు వేయడం లేదు. తన సొంత నిధులతో సేవా కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తూ వస్తున్నారు. ఆయన చేస్తున్న మంచి పనులకు ప్రజల నుంచి కూడా అనూహ్య స్పందన వస్తుంది. ఈ కార్యక్రమంలో 38వ వార్డ్ అధ్యక్షులు గురజాపు రవి, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజు, చేపల బుడ్డి, కోసూరి కిరణ్, పట్నాల సతీష్, రమాదేవి, అన్మోల్, శ్యామ్, సందీప్, అనీష్, సాగర్, అప్పలరాజు, ప్రసాద్, మృత్యాంజయచారి, నాగబాబు, చేపల రాజు, 39వ వార్డ్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, చోడిపిల్లి శివ తదితరులు పోల్గున్నారు.

# 48వ వార్డులో మౌలిక వసతులకు కృషి చేయాలి

**- విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజుతో భేటీ అయ్యిన గంకల కవిత అప్పారావు యాదవ్ - నార్త్ కార్పొరేటర్ల సమావేశంలో 48వ వార్డు సమస్యలు ప్రస్తావించిన గంకల కవిత అప్పారావు యాదవ్ - వార్డు సమస్యలపై వినతి అందజేసి వార్డు పర్యటన చేసి సమస్యలు పరిష్కరించాలని కోరిన గంకల**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ నార్త్ కార్పొరేటర్లతో నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు యాదవ్ పాల్గొని వార్డు సమస్యలపై ప్రస్థావించారు. సమస్యల వలయంలో ఉన్న 48వ వార్డు సమస్యలను పరిష్కారించాలని కోరారు. కొండ ప్రాంతం కావడంతో ప్రకృతి విప్పతులు, కాలక్రమేణా వస్తున్న సమస్యలు రోజురోజుకి పెరుగుతూ ఉన్నాయని, వార్డులో సమస్యలు పెరిగిపోతున్నాయని వివరించారు. న్యూ శ్రీనివాస్ నగర్, బాపూజీ నగర్, ఇందిరా నగర్ -1, ఇందిరా నగర్ -2, ఇందిరా నగర్ -3, ఇందిరా నగర్ -4, ఇందిరా నగర్ -5, రాంజీ ఎస్టేట్ ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మాణం, కాలువలు నిర్మాణం చేపట్టాలని, ఇందిరా నగర్ -1లో బబాక్స్ కల్వర్ట్ నిర్మాణం చేసి వర్షా కాలం ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఇందిరా నగర్ -2లో మరమ్మత్తులకు గురి అయ్యిన అంగన్వాడీ భవనం తొలగించి వాటి స్థానంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణం చేయాలని, ఇందిరా నగర్ -3 లో కమ్యూనిటీ హాల్ వద్ద నూతన బోర్ ఏర్పాటు చేసి కమ్యూనిటీ హాల్‌కు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇందిరా నగర్ -4 లో ఉన్న కమ్యూనిటీ హాల్‌కు జి.ఐ రూఫ్ షెడ్ నిర్మాణం చేసి కమ్యూనిటీ హాల్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని, నీలకంఠ నగర్, రామకృష్ణ నగర్, శివలింగ పురం, పల్నాటి కాలనీలో కొన్ని చోట్ల నూతన మెట్లు నిర్మాణం చేపట్టి, మెట్లకు ఇరువైపులా ఎస్.ఎస్ రైలింగ్ ఏర్పాటు చేసి మెట్లు మార్గాన వెళ్లే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వీధి దీపాలు సరిగ్గా లేకపోవడం వలన చిల్లర దొంగతనాలు ఆకతాయిల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయాలనీ, వార్డులో అదనంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని, పారిశుధ్య పనులకు కావాల్సిన పనిముట్లను ఏర్పాటు చేయాలనీ, వార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, స్మశాన వాటికకు సెక్యూరిటీ గార్డును, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వార్డు అభివృద్ధిలో భాగంగా ఉన్న సమస్యలపై నూతనంగా టెండర్లను పిలవాలని కోరారు. వార్డులో పర్యటించి క్షేత్ర స్థాయి నుంచి నెలకొన్న సమస్యలు నేరుగా చూసి, వార్డు పరిధిలో అవసరమగు మౌలిక వసతులు పర్యవేక్షణ చేసి ప్రజల ఇబ్బందులను నేరుగా గమనించి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరినట్టు గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు.

# జీవీఎంసీ సమన్వయ సమావేశంలో పలు అంశాలపై చర్చించిన ప్రజాప్రతినిధులు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు తదితర అంశాలపై నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జీవీఎంసీ పరిధిలోని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.భరత్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, శాసనసభ్యులు ఘంటా శ్రీనివాసరావు, పి.జి.వి.ఆర్. నాయుడు, వంశీకృష్ణ యాదవ్, పంచకర్ల రమేష్ బాబు, పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణు కుమార్ రాజు, కొణతాల రామకృష్ణలతో పాటు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర ఉన్నతాధికారులతో కలసి జివిఎంసి సమన్వయ సమావేశం మంగళవారం వి.ఎం. ఆర్.డి.ఎ. కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఎనిమిది జోన్లను పరిపాలన సౌలభ్యం కొరకు పది జోన్లుగా 2026 జనవరి 1 నుండి పునర్వ్యవస్థీకరణ చేసి కార్యకలాపాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా కొత్తగా నార్త్, అగనంపూడి జోన్లు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఇంతవరకు చేపట్టవల సిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి విశాఖ నగర అభివృద్ధి దిశగా అన్ని నియోజకవర్గాల్లోని ప్రతి వార్డును సమతుల్యంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అలాగే మరికొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయని వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందిస్తామని మేయర్ తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కొరకు విశాఖ జివిఎంసి పరిధిలో ఎనిమిది జోన్లను 10 జోన్లుగా రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసిందని జనవరి 1 నుంచి 10 జోన్లలో కార్యకలాపాలు జరుపుతూ ఆయా జోన్లలో జోనల్ స్థాయిలో పరిపాలన పరంగా ప్రజలకు సేవలు అందించే దిశగా జోనల్ సదస్సులను ప్రారంభించామని, ఇప్పటికే భీమిలి, మధురవాడ జోనల్ సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం జీవీఎంసీ సమన్వయ సమావేశానికి సంబంధించిన జీవీఎంసీ పరిపాలన, అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు కమిషనర్ వివరించారు. ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమం దిశగా జీవీఎంసీ పరిధిలో 35 లేఔట్లలో టిడ్కో ఇల్లు నిర్మాణం చేపట్టడం జరిగిందని, అందులో 15 లేఔట్లు టిడ్కో ఇల్లు సంవత్సరం క్రితమే లబ్ధిదారులకి అందించడం జరిగిందని, 16 లేఔట్లలో టిడ్కో ఇల్లులు పూర్తయ్యాయని, 5 లేఔట్లులలో టిడ్కో ఇల్లులు పూర్తి అవ్వవలసి ఉంటుంది అన్నారు. ఈ లేఔట్లలో 6000 మందికి బ్యాంకులోను ప్రక్రియ పూర్తి అవ్వవలసి ఉందని, అలాగే కొంతమంది లబ్ధిదారులు మరణించినందున, మరికొందరు ఇల్లు వద్దని అంగీకారం తెలిపారని తెలిపారు. మిగిలిన ఇళ్లను ఇతర లబ్ధిదారులకు అందించేందుకు నియోజవర్గాల వారీగా శాసనసభ్యులతో చర్చించి మిగిలిన ఇళ్లను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని కమిషనర్ తెలపగా చాలామంది టిడ్కో గృహాలకు డబ్బులు చెల్లించారని, కాని వారికి ఇప్పటికే గృహాలు మంజూరు చేయలేదని చాలామంది ఇబ్బందులకు గురి అవుతున్నారని అందరు శాసన సభ్యులు కమిషనర్‌కు తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ మొత్తం గృహాలను త్వరితగతిన పూర్తి చేసి అందిస్తామని బదులిచ్చారు. అలాగే జీవీఎంసీ అనకాపల్లిలో ఉన్న జోనల్ కార్యాలయాన్ని తొలగించి అదే ప్రాంతంలో వాణిజ్య సముదాయంతో కూడిన జోనల్ కార్యాలయాన్ని నూతన భవనాన్ని నిర్మించాలని, అనకాపల్లిలో వెండింగ్ జోన్‌లను ఏర్పాటు చేయాలని అనకాపల్లి శాసనసభ్యులు తెలిపారు. ఈ సమీక్షలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు సత్యవేణి, డి.వి.రమణ మూర్తి, ఎస్.ఎస్.వర్మ, పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్, ప్రధాన ఇంజనీరు సత్యనారాయణ రాజు, డి.సి.ఆర్. శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్ కుమార్, డి.డి.హెచ్. పి.డి. యుసిడి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, జోనల్ కమిషనర్లు, సిటీ వెటర్నరీ ఆఫీసర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు, టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజనీరింగ్ పాల్గొన్నారు.

# పంచారామంలో శాంతాశ్రమ మఠాధిపతి ప్రత్యేక పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో మంగళవారం సాయంత్రం శ్రీ సంస్థాన్ శాంతాశ్రమ మఠాధిపతి శ్రీ వామానాశ్రమ మహా స్వామీజీ ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి దర్శనమునకు విచ్చేసిన సందర్భంగా ఆయనకు ఆలయ అధికారి బళ్ల నీళ్లకంతో ఆలయ చైర్మన్ కంటే జగదీష్ మోహన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామిని బాలా త్రిపుర సుందరి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నంది మండపంలో స్వామీజీకి ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేసి గౌరవించారు. అలాగే ఆలయ అధికారి ఆయనకు శ్రీస్వామి వారి ప్రసాదములు, స్వామి వారి చిత్రపటం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా అమలాపురం



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం మునిసిపాలిటీని ఫస్ట్ గ్రేడ్ నుండి సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అమలాపురాన్ని అభివృద్ధి చేయాలంటే కాకినాడ, రాజమండ్రి కార్పొరేషన్ స్థాయికి వెళ్లాలన్న ఎమ్మెల్యే ఆనందరావు ఆలోచనకు ఈ ఉత్తర్వులు తొలి అడుగు పడినట్టు అయింది. సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా గుర్తిస్తూ ప్రభుత్వం జిఓ జారీ చేసింది. ఇప్పటికే మూడు మేజర్ పంచాయితీలలో కొంత భాగాన్ని మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ఈదరపల్లి, పేరూరు గ్రాభ సభల్లో ఆమోదం పొందింది. ఎమ్మెల్యే చొరవతో రెండు రోజుల్లో కామన గరువు పంచాయతి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. వచ్చే మున్సిపల్ ఎన్నికలలో ప్రస్తుతం వున్న 30 వార్డులు స్థానే మూడు గ్రామాలలోని విలీన భాగాలను కలుపుకొని 40 వార్డులుగా మున్సిపాలిటీ రూపాంతరం చెందనుంది. అమలాపురం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసేందుకు పట్టణానికి చేరువుగా వున్న 7 పంచాయతీలను కలిపేందుకు ఎమ్మెల్యే ఆనందరావు తన వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు.

# అచ్చంపేటలో లూయిస్ బ్రెయిలీ వర్ధంతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** చూపు లేని వారికి అక్షర ప్రదాతగా నిలిచిన లూయిస్ బ్రెయిలీ 1824లో బ్రెయిలీ లిపిని కనిపెట్టి అంధులకు అక్షర జ్ఞానాన్ని అందించారని ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేట మండల పరిషత్ యూపీ పాఠశాలలో హెడ్మాస్టర్ కే వేదాద్రి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం లూయిస్ బ్రెయిలీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ శ్రీనివాస్ ఎం విఘ్నేశ్వరరావ్ పి శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యాయులు ఎం రాజేశ్వరి కనకలక్ష్మి చంద్రకళ విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్లాప్‌లు వచ్చినా హీరోయిన్ ఎక్కడా తగ్గలేదు!



బాలీవుడ్‌లో దేశభక్తి నేపథ్యంగల సినిమాలు నిరంతరం రిలీజ్ అవుతూనే ఉంటాయి. రకరకాల బ్యాక్ డ్రాప్ లో సినిమాలు చేస్తుంటారు. వాటికి సక్సెస్ రేట్ కూడా ఎక్కువగానే ఉంటుంది. వందల వేలకోట్లు సాధించిన సినిమాలెన్నో. ఈ మధ్యనే రిలీజ్ అయిన 'ధురంధర్' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. స్పై థ్రిల్లర్‌లో ఈ సినిమా ఓ ట్రెండ్‌ని సృష్టించింది. ఇందులో రణవీర్ సింగ్ స్పై రోల్‌లో ఆకట్టుకుంటాడు. ఇంకా ముందుకెళ్తే సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్, హృతిక్ రోషన్, అమీర్ ఖాన్, విక్కీ కౌశల్, టైగర్ ష్రాప్ లాంటి స్టార్లు దేశభక్తి నేపథ్యంలో చేసిన సినిమాలు మంచి ఫలితాలు సాధించాయి. కానీ బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ మాత్రం ఈ జానర్‌లో ఎన్ని ప్రయోగాలు చేస్తున్నా సరైన ఫలితాలు మాత్రం రావడం లేదు. కంగన నటించి 'ధాకడ్', 'తేజస్' లాంటి చిత్రాలు భారీ అంచనాల మధ్య రిలీజ్ అయినా ఫలించలేదు. ఈ రెండు సినిమాల కోసం కంగన ఎంతగానో శ్రమించింది. స్పై జానర్లో మొట్టి మొదటి లేడీ స్పైగా బాలీవుడ్‌లో సత్తా చాటాలని చేసిన ప్రయత్నాలివి. కానీ పని తప్ప ఫలితం కనిపించలేదు. చివరిగా ఇందీరాగాంధీ బయోపిక్‌తో మరోసారి దేశభక్తిని చాటుకోవాలనుకుంది. ఆ సినిమా కూడా నిరాశనే మిగిల్చింది. వెండితెరపై ప్రధాని పాత్రలో దేశ సమగ్రత కోసం చేసిన ప్రయత్నం ఫలించలేదు. 19756 దేశంలోని అత్యవరస పరిస్థితి ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన 'ఎమర్జెన్సీ' నీరుగార్చింది. ప్రధానిగా పదవి చేపట్టిన తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం ప్రకటించడం సిమ్లా ఒప్పందం ఆపరేషన్ బ్లూ స్టార్ సమయంలో తీసుకున్న నిర్ణయాలు వంటి ప్రశ్నలను ఇందులో చర్చించారు. కానీ ఇవేవి ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వలేదు. ఎంగేజింగ్‌గా చెప్పడంలో కంగన వైఫల్యం చెందింది. దీంతో భారీ నష్టాలు తప్పలేదు. అయినా సరే కంగన మాత్రం ఎక్కడా నెరవలేదు. హిట్ కొట్టే వరకూ ప్రయత్నం ఆపనంటూ పని చేస్తోంది.

మరోసారి దేశభక్తిని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. 'భారత భాగ్య విధాత' టైటిల్‌తో మరో సినిమా చేస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాజెక్ట్ గురించి కంగన ఇంతవరకూ ఎక్కడా ప్రకటించలేదు. బాలీ వుడ్ మీడియాలో కూడా ఎలాంటి ప్రచారం తెరపైకి రాలేదు. కానీ సినిమా ఆన్ సెట్స్‌లో ఉందని అధికారికంగా ప్రకటించింది. తన సొంత నిర్మాణ సంస్థ మణికర్ణిక ఫిల్మ్స్ ప్రొడక్షన్ బ్యానర్ పైనే నిర్మిస్తోంది. అయితే ఈ సినిమాకు తానే స్వీయా దర్శకత్వంలో నిర్మిస్తోందా? లేక పాత్ర, నిర్మాణం వరకే పరిమితమవుతుందా? అన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు.

# దిల్ రాజు బ్యానర్ నుంచి అతను ఎగ్జిట్..?



కొంతమంది డైరెక్టర్స్ కొన్ని నిర్మాణ సంస్థల దగ్గర ఏళ్లకు ఏళ్లు పనిచేస్తుంటారు. బయట వాళ్లతో సినిమాలు తీయలేక కాదు ఆ కంపెనీతో అలాంటి ఒక బాండింగ్ ఏర్పడుతుంది. అందుకే వాళ్లని ఫలనా బ్యానర్‌కి ఆస్థాన దర్శకులు అంటుంటారు. అంతేకాదు ఆ బ్యానర్‌లో వచ్చే సినిమాలకు ఈ డైరెక్టర్స్ ఇన్ డైరెక్ట్ సపోర్ట్ కూడా ఉంటుంది. టాలీవుడ్‌లో అలాంటి నిర్మాతలు, దర్శకుల కాంబినేషన్స్ చాలానే ఉన్నాయి. అలాంటి వారిలో ఒకరు వంశీ పైడిపల్లి. ఆయన కెరీర్ తొలినాళ్ల నుంచి శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌ని విడిచిపెట్టలేదు. వంశీ పైడిపల్లి బాలీవుడ్ హీరో సినిమా.. వంశీ పైడిపల్లి సినిమా అంటే అది ఎస్.వి.సి బ్యానర్‌లోనే దిల్ రాజు, శిరీష్ నిర్మాతలే అని ఫిక్స్ అయ్యేలా చేసుకున్నారు. ఐతే త్వరలో దిల్ రాజు బ్యానర్‌లో వంశీ పైడిపల్లి బాలీవుడ్ హీరో సినిమా ఉంటుందని అనుకోగా వంశీ బాలీవుడ్ హీరో సినిమా నిజమే కానీ బ్యానర్ మాత్రం ఎస్.వి.సి కాదని తెలుస్తుంది. దిల్ రాజు బ్యానర్‌లో వంశీ పైడిపల్లి ఒక బాలీవుడ్ స్టార్ సినిమా అని ఆమధ్య వార్తలు రాగా దానికి ఎస్.వి.సి బ్యానర్ నుంచి ఒక ప్రెస్ నోట్ రిలీజైంది. తమ బ్యానర్‌లో వచ్చే సినిమాల గురించి రకరకాల వార్తలు వస్తున్నాయి. వాటిల్లో ఏమాత్రం నిజం లేదు ఏదైనా ప్రాజెక్ట్ ఓకే అయితే మేమే ఎనౌన్స్ చేస్తామని అన్నారు. ఐతే ఇప్పుడు వంశీ పైడిపల్లి బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ తో ఒక సినిమా లాక్ అయ్యిందట. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తారని తెలుస్తుంది. అదే నిజమైతే వంశీ పైడిపల్లి దిల్ రాజు బ్యానర్ నుంచి బయటకు వచ్చినట్టే అని చెప్పొచ్చు.

సల్మాన్‌తో సినిమా మైత్రి మేకర్స్‌కు వంశీ పైడిపల్లి బెస్ట్ ఆప్షన్ అనిపించాడు. వంశీ పైడిపల్లి 3, 4 ఏళ్లకు ఒక సినిమా తీసినా అందులో విషయం ఉంటుంది. అందుకే ఆయన డైరెక్షన్ లో సినిమా అంటే హీరోలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. సల్మాన్‌తో వంశీ పైడిపల్లి సినిమా కన్ఫర్మ్ అయినట్టే. ఐతే కెరీర్‌లో ఫస్ట్ టైం వంశీ బయట బ్యానర్‌కి సినిమా చేస్తున్నాడు. దిల్ రాజు బ్యానర్‌లో ఇన్నాళ్లు సినిమాలు చేసిన వంశీ మైత్రి మూవీస్‌తో ఈ ప్రాజెక్ట్ చేయడం అందరినీ షాక్ అయ్యేలా చేస్తుంది. మరి దిల్ రాజు బ్యానర్ నుంచి వంశీ పైడిపల్లి పూర్తిగా ఎగ్జిట్ అయ్యాడా లేదా ఈ సినిమా వరకు చేసి మళ్లీ నెక్స్ట్ ఎస్.వి.సి బ్యానర్‌లోనే వంశీ సినిమా ఉంటుందా అన్నది చూడాలి. ఏది ఏమైనా సౌత్ డైరెక్టర్‌తో బాలీవుడ్ హీరోల సినిమాలు ఇప్పుడు ట్రెండ్ సృష్టిస్తుండగా వంశీ లాంటి డైరెక్టర్‌తో సల్మాన్ ఖాన్ సినిమా కూడా సంథింగ్ స్పెషల్ అనిపిస్తుంది.

# మెగా ప్లాన్‌లో బాబీ.. సూపర్ అప్డేట్..!



మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్ లో మరో సినిమా వస్తుంది. వాల్తేరు వీరయ్య సినిమా తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా క్రేజీగా ఉండబోతుంది. బాబీ చిరు కాంబో సినిమాకు సంబంధించిన అప్డేట్స్ మెగా ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తున్నాయి. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ని తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే ఈ సినిమాకు రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నట్టు తెలుస్తుంది. మెగా 158వ సినిమాగా రాబోతున్న ఈ మూవీలో చిరంజీవి సరసన ఐశ్వర్యరాయ్ హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నాయట. దాదాపు ఆమెనే హీరోయిన్‌గా తీసుకుంటున్నారట మేకర్స్. కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో ఈ సినిమా వస్తుంది. మెగా అభిమాని అయిన బాబీ ఈ సినిమాను మెగా ఫ్యాన్స్‌కి ఒక ఫీస్ట్ అందించేలా ప్లాన్ చేస్తున్నారట. అందులో భాగంగానే కథ, కథనాల మీద కసరత్తు చేస్తున్నారు. బాబీ టేకింగ్ ఇప్పటికే ఆడియన్స్ సూపర్ అనేశారు. లాస్ట్ ఇయర్ డాకు మహారాజ్ సినిమాతో ఆయన మంచి జోష్ అందించారు. ఇక నెక్స్ట్ చిరుతో మరో మాస్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా మెగాస్టార్ మాస్ స్టామినా చూపించేలా ఉంటుందట. సినిమాలో ఐశ్వర్యరాయ్ నటించడం కూడా ప్లస్ అని చెప్పొచ్చు. మెగా మూవీకి రెహమాన్ మ్యూజిక్, ఐశ్వర్య రాయ్ గ్లామర్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తాయి. మెగా మాస్ ఎంటర్టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాలో చిరంజీవి క్యారెక్టరైజేషన్ కూడా నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందని తెలుస్తుంది. తెలుగులో ఐశ్వర్య రాయ్ చాలా తక్కువ సినిమాలు చేశారు. తెలుగులో ఎక్కువ సినిమాలు చేయక పోయినా ఇక్కడ కూడా ఐశ్వర్యాకి మంచి పాపులారిటీ ఉంది.

అందుకే మెగాస్టార్‌కి ఆమె జోడీ అయితే అదుర్స్ అనేస్తున్నారు. ఈ సినిమా తర్వాత చిరంజీవి శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో సినిమా చేయనున్నారు. ప్రస్తుతం ఆయన నటించిన మన శంకర వరప్రసాద్ సంక్రాంతికి వస్తుంది. ఈ సినిమా తర్వాత విశ్వంభర ఈ ఇయర్ సమ్మర్ రిలీజ్ ప్లాన్ ఉంది. బాబీ సినిమా నెక్స్ట్ ఇయర్ రిలీజ్ సెకండ్ హాఫ్ రిలీజ్ ఉండొచ్చని టాక్. బాబీ కూడా మెగా బాస్‌కి ఒక మెమరబుల్ హిట్ ఇవ్వాలని ఉత్సాహంగా ఉన్నారు. రీసెంట్‌గా సుజీత్ తన అభిమాన హీరో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి ఓజీతో సూపర్ హిట్ ఇచ్చాడు. బాబీ కూడా మెగాస్టార్ మీద ఉన్న అభిమానం ఫ్యాన్స్ ఆయన్ను ఎలా చూడాలని అనుకుంటున్నారో అలా చూపిస్తారని తెలుస్తుంది. బాబీ చిరు కాంబో సినిమాపై ఈ అప్డేట్స్ ఫ్యాన్స్‌కి ఫుల్ జోష్ అందిస్తున్నాయి. మరి మెగా 158 మాస్టర్ ప్లాన్ చూస్తుంటే టార్గెట్ భారీగానే ఉన్నట్టు ఉందనిపిస్తుంది.

# క్లాస్ టైటిల్‌తో మసాలా ట్రీట్..?



మాస్ మహరాజ్ రవితేజ ఈ సంక్రాంతికి భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాతో వస్తున్నారు. లాస్ట్ ఇయర్ మాస్ జాతరతో నిరాశపరిచిన రవితేజ భర్త మహాశయులకు సినిమాతో సక్సెస్ అందుకోవాలని చూస్తున్నారు. కిషోర్ తిరుమల డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాను ఎస్.ఎల్.వి సినిమాస్ బ్యానర్‌లో సుధాకర్ చెరుకూరి నిర్మించారు. సినిమాలో డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ హీరోయిన్స్‌గా నటించారు. రవితేజ మార్క్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రాబోతుంది. అంతేకాదు ఇద్దరి భామల మధ్య హీరో నలిగిపోయే సినిమాలు తెలుగు ఆడియన్స్‌ని మెప్పిస్తాయి. ఈ క్రమంలో రవితేజ నుంచి ఆఫ్టర్ లాంగ్ టైం గ్యాప్ తర్వాత వస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ సంక్రాంతికి పర్ఫెక్ట్ జోష్ ఇస్తుందని అంటున్నారు. ఐతే ఈ సినిమా ప్రమోషన్స్‌లో డైరెక్టర్ కిషోర్ తిరుమల సినిమాలో హీరోయిన్స్ గ్లామర్ ట్రీట్ బాగుంటుందని అన్నారు. సినిమాలో ఆషిక ఫ్రాన్స్‌లో ఉంటుంది. అక్కడ ఆమె సీన్స్ ఇంకా గ్లామర్ సీన్స్ అన్నీ ఆకట్టుకుంటాయని అన్నారు. ఇక సినిమా నుంచి రీసెంట్‌గా రిలీజైన వామ్మో వాయ్యో మాస్ సాంగ్ ఇద్దరు హీరోయిన్స్ మధ్యలో రవితేజ మాస్ ట్రీట్ ఇవ్వగా అది స్టోరీకి సంబంధం లేకుండా వస్తుందని అన్నారు. ఇప్పటికే భీమ్స్ ఇచ్చిన సాంగ్స్ భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా మీద మంచి హైప్ తెచ్చాయి. రవితేజ ఎనర్జీకి సరిపోయే కథతో వస్తున్న ఈ సినిమా సంక్రాంతికి పక్కా ఎంటర్టైన్ చేస్తుందని అంటున్నారు. రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి.. మాస్ రాజా ఫ్యాన్స్ కూడా ఈ సినిమా సూపర్ ఎంటర్టైన్ అందించేలా ఉంది. ఐతే ఫ్యామిలీ సినిమా అయినా కూడా మాస్ రాజా ఫ్యాన్స్ కి నచ్చే అంశాలు కూడా ఉంటాయని తెలుస్తుంది. సంక్రాంతి సినిమాల సందడిలో రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి సంథింగ్ స్పెషల్ మూవీగా రాబోతుంది.

మరి ఈ సినిమాపై మాస్ రాజా ఫ్యాన్స్ పెట్టుకున్న నమ్మకాన్ని ఏం చేస్తారన్నది చూడాలి. రవితేజ ఈమధ్య ఎక్కువ మాస్ బ్యాక్ డ్రాప్ కథలతోనే వస్తున్నారు. అందుకే ఆయనకు సక్సెస్ దూరమైంది. చివరగా వచ్చిన మాస్ జాతర సినిమా కూడా తీవ్రంగా డిజప్పాయింట్ చేసింది. ఐతే సినిమా సక్సెస్ ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా రవితేజ సినిమాలు చేస్తూ వెళ్తున్నారు. మాస్ జాతర వచ్చి రెండు నెలలు అవుతుందో లేదో భర్త మహాశయులకు విజ్ఞప్తితో మరోసారి ఫ్యాన్స్ ముందుకొస్తున్నారు. ఈ సినిమా తర్వాత రవితేజ శివ నిర్వాణ, వివేక్ ఆత్రేయలాంటి టాలెంటెడ్ డైరెక్టర్స్‌తో పనిచేస్తారని టాక్. ఈ ఇద్దరి దర్శకుల్లో ఎవరితో రవితేజ సినిమా పడినా కూడా నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుందని మాస్ రాజా ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# బ్లో అవుట్‌పై ఆందోళన వద్దు...మంటలు అదుపులోనే ఉన్నాయి

**- మరో నాలుగు రోజులలో మంటలను పూర్తిగా నిలువరిస్తాం - బ్లో అవుట్‌ను నియంత్రించేందుకు ముంబై నుండి చేరుకున్న రెండు నిపుణులతో కూడిన బృందాలు - బ్లో అవుట్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం**





**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసు మండలో సోమవారం జరిగిన గ్యాస్ లీకేజ్ (బ్లో అవుట్) కారణంగా చుట్టుపక్కల పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని మంటలు అదుపులోనికి వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో పాత్రికేయులు సమావేశం నిర్వహించి గ్యాస్ లీకేజీ (బ్లో అవుట్) సందర్భంగా ఓఎన్జిసి చేపట్టిన గ్యాస్ లీకేజ్ మంటల నియంత్రణ చర్యల పరిణామాలను విలేక రులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కిపురం మండలం ఇరుసు మండ గ్రామంలో ఓఎన్‌జిసి చమురు బావిలో డ్రిల్లింగ్ చేస్తుండగా సోమవారం ఉదయం 11:30 గంటలకు గ్యాస్ లీకేజీ అయ్యి 12:30 గంటలకు మంటలు వ్యాపించాయని తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు బోరుబావి చుట్టూ సమీపంలోని పంట కాలువల నుండి నీటిని నాలుగు పంపులు ద్వారా మంటలపై వెదచల్లడం ద్వారా మంటలు చాలావరకు అదుపులోకి వచ్చాయన్నారు. బ్లో అవుట్ సంఘటన కారణంగా ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలవారి పాలెం గ్రామాలకు చెందిన సుమారు 450 మందిని సురక్షత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. ఈ మూడు గ్రామాల ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని గ్యాస్ లీకేజీ మంటలు 90 శాతం తగ్గు ముఖం పట్టాయని రానున్న నాలుగు రోజులలో మంటలు అదుపులోకి వస్తాయని వారం రోజులలో బోరు బావిని మూసి వేస్తారని (క్యాపింగ్)ఆయన స్పష్టం చేశారు. ఒకేసారి బోరు బావి మంటలు అదుపు చేయడం వల్ల శాస్త్రీయంగా పర్యావరణపరంగా ఇబ్బందులు ఉన్నాయని ప్రత్యేక గ్యాస్ లీక్ నియంత్రణ టీములు నిర్ధారించిన నేపథ్యంలో వారి సూచనల మేరకు క్రమక్రమంగా మంటలను అదుపు చేస్తూ 4 రోజులలో పూర్తిగా మంటలను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. రెండు ప్రత్యేక నిపుణులతో కూడిన గ్యాస్ లీకేజ్ నియంత్రణ టీములు ముంబై నుంచి డ్రిల్లింగ్ ప్రాంతానికి చేరుకొని నియంత్రణ చర్యలకు సిద్ధమయ్యాయన్నారు. గ్యాస్ లీకేజీ బ్లో అవుట్ మూలంగా ఇరుసుమండ గ్రామంలో బోరుబావి చుట్టుపక్కల మూడు ఎకరాల విస్తీర్ణంలో వరి పంట, 75 కొబ్బరి చెట్లు దెబ్బతిన్నాయని, అదేవిధంగా సుమారు 450 మందికి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నష్టం అంచనా వేసి బాధితులకు నష్టపరిహారాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శాంత నూరుదాస్ (రాజమండ్రి), సక్సేన (న్యూ ఢిల్లీ), జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

## వాకాడ, విజయ రాయుడుపాలెంలో పారిశుద్ధ్య పనుల పరిశీలన

**- గ్రామాల పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం : అధికారులు**





**కరప, (రాజధాని వార్తలు):** ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అమలులో భాగంగా కరప మండలంలో వాకాడ, విజయ రాయుడు పాలెం గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జటా వల్లభుల శ్రీనివాస్, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి సలాది వెంకట శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న చెత్త నిర్మూలన, డ్రైనేజీ కాలువల శుభ్రత, వీధుల శుభ్రపరిచే చర్యలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల నాణ్యత మెరుగుపడేలా సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలని, గ్రామాల్లో ఎక్కడా చెత్త నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు ఇంటి చెత్తను డ్రైనేజీల్లో లేదా వీధుల్లో వేయకుండా, పరిశుద్ధ కార్మికులకు అందజేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల స్వచ్ఛత సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో మహిళ మృతి ఆరోపణ

**- ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన - మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో మహా ధర్నాకు ఏర్పాట్లు**



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో ఉన్న ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ మృతి చెందిందని మృతురాలి బంధువులు మంగళవారం సాయంత్రం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. బాధిత మహిళ బంధు వులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా అమీనాబాద్ గ్రామానికి చెందిన మేరుగ రత్నం (75) అనే మహిళకు గుండెకు సంబంధించిన బలహీనత రావడంతో ఈనెల రెండవ తేదీన మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స నిర్వహించేందుకు గాను మహిళ కుటుంబం నిరుపేద కుటుంబం అయినప్పటికీ ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింప చేయకుండా రోగి బంధువుల వద్ద నుంచి లక్ష రూపాయలు పైబడి సొమ్ములు వసూలు చేసి రత్నంకు ఒక స్టంట్‌ను వేసినట్టు బంధువులు తెలిపారు. తదుపరి ఆమెను వార్డులోనికి మార్పు చేయగా నాలుగు గంటల్లోనే మహిళ మృతి చెందింది. ఆసు పత్రి యాజమాన్యం ఆమె మృతి చెందిన విషయాన్ని గోప్యంగా ఉంచి బంధువుల నుంచి వైద్య ఖర్చులు వసూలు చేసినట్టు వారి ఆరోపించారు. తదుపరి విషయం తెలిసి మృతురాలి బంధువులు ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేయగా వైద్యానికైనా ఖర్చులు తిరిగి చెల్లిస్తామని, అల్లరి చేయకుండా మృతదేహాన్ని తీసుకు వెళ్తే తదుపరి మాట్లాడుకోవచ్చునని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో మృతదేహాన్ని తీసుకువెళ్లి అంతిమక్రియలను చేపట్టినట్టు చెప్పారు. తదుపరి ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా మాకు ఎలాంటి సంబంధం లేదు, ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ ఎంతో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు బంధువులు ఆరోపించారు. దానితో మృతురాలి బంధువులు మంగళవారం సాయంత్రం మరోసారి ఆసుపత్రికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ విషయంలో మృతురాలు బంధువులు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను సహాయం కోరగా ఆయన బంధువులకు హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యంపై బుధవారం ఆసుపత్రి వద్ద భారీ స్థాయిలో ధర్నా నిరసన కార్యక్ర మం చేపట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిసింది.

## పెద్దాపురప్పాడు ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన డిప్యూటీ ఎంపీడీవో





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం పెద్దాపురప్పాడు ప్రభుత్వ పాఠశాలను మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థుల బోధనా పద్ధతులు, హాజరు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.

అనంతరం 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించిన డిఫ్యూడి ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పాఠశాలలో నిర్వహిస్తున్న అసైన్మెంట్ (ఎఫ్.ఏఉ 3) పరీక్ష లను పరిశీలించి, ప్రశ్నాపత్రాల సరళి, మూల్యాంకన ప్రక్రియలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన విధానం, విద్యార్థుల మార్కుల మెరుగు దలకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకు న్నారు. విద్యార్థుల విద్యా ప్రగతిని దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల ద్వారా విద్యార్థుల నేర్చుకునే స్థాయిని అంచనా వేసి, బలహీనతలను గుర్తించి వాటిని అధిగ మించేలా అదనపు బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించిన అధికారులు, హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో సమన్వయం మరింత బలోపేతం చేయాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించా ల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చట్ట పరిరక్షణకు మీడియా అవసరం ఎంతో ఉంది

**- సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తోంది - నిజ నిర్ధారణతో కూడిన వార్తల ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన పెరుగుతుంది : ఎమ్మార్ పేట సీఐ దివాకర్ యాదవ్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని విశాఖ ఈస్ట్ ఏసిపి లక్షణమూర్తి అన్నారు. స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఏసీపీని మర్యాద పూర్వకంగా కలుసుకొని అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా వెలుగులోకి తీసుకు వస్తూ, చట్ట పరిరక్షణకు సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా భద్రతకు సంబంధించిన అంశాల్లో రిపోర్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్‌ను కలుసుకొని డైరీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజ నిర్ధారణతో కూడిన వార్తల ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన పెరుగుతుందని, పోలీస్ శాఖ, మీడియా మధ్య సమన్వయం మరింత బలపడాల్సిన అవసరం ఉందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలను కొనియాడారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు ఈస్ట్ ఏసిపి లక్ష్మణమూర్తి, ఎమ్మార్పేట సీఐ దివాకర్ యాదవ్ లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ కిషోర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సాయి, బొబ్బిలి జయరాం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు హాసిని వర్మ ఆదేశాలతో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాండవ గాయత్రి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళ లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. మొదటి ఇద్దరు విజేతలకు డీసీసీ అధ్యక్షులు వర్మలక్ష్మి మరియు కుక్కర్ అందజేశారు. పాల్గొన్నవారికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. భీమిలి ఇంచార్జ్ రామకృష్ణ అందరికి మిఠాయి పంచి పెట్టి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి, దక్షణ నియోజకవర్గ ఇంచార్జ్ కే వి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు రజియా బేగం, ఫర్వీన్ ఖాన్, రజియా బేగం, గవర వెంకటరమణ, మాకేన లక్ష్మ, వరలమ్మా, డా విజయ్ చంద్రా, అప్పారావు, భోగవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సింహపురి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మరియు కమిషనర్ నందన్‌ల చేతుల మీదుగా 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను మంగళవారం సాయంత్రం మేయర్ ఛాంబర్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని సింహపురి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరణకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సింహపురి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యచరణ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ, జనరల్ సెక్రటరీ సురేష్ బాబు, కన్వీనర్ సతీష్ రెడ్డి, ట్రెజరర్ సుమన్, అసోసియేషన్ చైర్మన్ స్నిద్ధ షారోన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శశి కిరణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతీ అడుగు రైతు సంతోషం కోసమే - 51 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

## - రైతులకు 24 గంటల్లోనే ధాన్యం చెల్లింపులు : పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్





**బొండపల్లి/ విజయనగరం, (రాజధాని వార్తలు):**రాష్ట్రంలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో సుమారు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి లక్ష్యంగా నిర్ణయించుకున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రైతుకు ఎటువంటి కష్టం రాకుండా వెన్నంటే ఉండి ఆదుకుంటా మని ఆయన భరోసా ఇచ్చారు. ప్రతి అడుగు రైతు సంతోషం కోసం, సంక్షేమం కోసమేనని ఆయన పేర్కొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం విజయనగరం జిల్లాలో విస్తృ తంగా పర్యటించారు. ఇందులో భాగంగా బొండపల్లి మండలం రాచకిండాం గ్రామంలో పర్యటించిన మంత్రి, నేరుగా రైతుల కల్లాల వద్దకు వెళ్లి వారితో మమేకమయ్యారు. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలను, నాణ్యతను స్వయంగా పరిశీలించిన ఆయన, కొనుగోలు ప్రక్రియపై రైతులతో సుదీర్ఘంగా చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు బండారు కృష్ణమూర్తి, గులిపిల్లి వెంకటరమణ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తమకు ఎటువంటి సమస్యా లేదని, డబ్బులు 24 గంటలలోపే జమ అవుతున్నాయని చెప్పారు. అనంతరం అక్కడ నిర్వహించిన రైతుల సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, అన్న దాతల వెన్నంటే ఉంటూ వారికి ఎటువంటి కష్టం రానివ్వబోమని స్పష్టం చేశారు. గతంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తోందని వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం భారీ లక్ష్యాన్ని నిర్దేశించు కుందని ఆయన ప్రకటించారు. ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు. ఈ నెల 10వ తేదీలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేసి, గ్రామాల్లో పండుగ వాతావరణాన్ని కల్పిస్తామని చెప్పారు. గతేడాది 31 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఈ ఏడాది 51 లక్షలు సేకరించి కొత్త రికార్డును సృష్టిస్తామని పేర్కొన్నారు. 97.6 శాతం మందికి 24 గంటల్లోపే డబ్బులు జమ అయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం కేవలం 29 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే సేకరించిందని, అలాగే చివరి ఏడాది రైతులకు రూ.1674 కోట్లు, మిల్లర్లకు సుమారు రూ.1100 కోట్లు బకాయిలు ఉంచేసిందని చెప్పారు. రైతులు పండించిన సన్నరకం బియ్యాన్ని సేకరించి సుమారు 36000 పాఠశాలలకు, 4వేల హాస్టళ్లకు మధ్యాహ్నభోజనం కోసం సరఫరా చేస్తున్నామని చెప్పారు. బియ్యం బస్తాలపై వాటిని పండించిన రైతు పేరును కూడా రాస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం మందికి వ్యవసాయం ద్వారానే ఉపాధి లభిస్తోందని, రైతు కుటుంబాల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సమాజ ఆకలిని తీర్చే రైతుకు నమ్మకం, భద్రత కల్పించి, భరోసానివ్వడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి చెప్పారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ మరియు ఎండి ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ, ఎంతోకష్టపడి పంట పండించే రైతు నష్టపోకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో వారి కష్టాలు, సమస్యలు తెలుసుకోవడానికే ఇలా పర్యటనలు చేస్తున్నామని చెప్పారు. నూకలు ఎక్కువగా రావడం, ఇతరత్రా కారణాలతో జిల్లాలో 1121 రకం వరిసాగును తగ్గించాల్సి ఉంటుందని సూచించారు. దానికి బదులు ఇతర లాభదాయక రకాలను సాగుచేయాలని కోరారు. జిల్లాలో సేకరిస్తున్న ధాన్యంలో తేమ 17 శాతం కంటే తక్కువగానే ఉంటోందని రైతులను అభినందించారు. గోధుమ పిండిని పంపిణీ చేయడానికి ప్రణాళికను రూపొందించామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో 96 శాతం మంది సన్న, చిన్నకార రైతులేనని, వారంతా ఎంతో కష్టపడి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ధాన్యం సేకరించిన వారిలో 95 శాతం మందికి అదేరోజు డబ్బులు జమ అయ్యాయని తెలిపారు.

మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీ విషయంలో 1:3కి అవకాశం కల్పించడం వల్ల సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, ఇప్పటికే చివరిదశకు చేరుకుందని వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ మాట్లా డుతూ, జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటికే 3.37 లక్షల టన్నులను సేకరించడం జరిగిందని చెప్పారు. సుమారు 67వేల మంది రైతులకు రూ.687 కోట్లు రూపాయలను చెల్లించడం జరిగిందని తెలిపారు. డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, గజపతినగరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ మంత్రి పడాల అరుణ, కూటమి నాయకులు కొండపల్లి కొండబాబు, మర్రాపు సురేష్, రెడ్డి పావని తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల ఎంఎల్ఏ లోకం నాగమాధవి, సివిల్ సప్లయిస్ డిఎం బొడ్డేపలి శాంతి, ఆర్డిఓ డి.కీర్తి, తాహసీల్దార్ డోలా రాజేశ్వర్రావు, ఎంపిడిఓ గిరిబాల, డిప్యూటీ ఎంపిడిఓ జనార్ధనరావు, ఇతర అధికారులతో పాటు కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మంత్రి నాదెండ్లను కలిసిన బిజెపి నాయకులు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్‌ను బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు ఎం భాస్కరరావు కలిశారు. ఖరీఫ్ 2025 – 26 ధాన్యం కొనుగోలుపై క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మంగళవారం ఆయన బొండపల్లి మండలం రాచకిండం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి దుస్సాలువాతో సత్కరించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో రేషన్ దారులకు రేషన్ డిపోల ద్వారా కందిపప్పు, మంచి నూనె తక్కువ ధరలకే అందజేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు మండల పార్టీ అధ్యక్షులు మేటికోటి భాస్కర్ రావు తెలిపారు.

# మంచి పాలన అందించే కాంగ్రెస్‌కు అండగా నిలవండి



**తిరుపతి, (రాజధాని వార్తలు):** బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, అన్నదమ్ముల కలసి జీవిస్తున్న వారి మధ్య కులమతాల పేరుతో చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని జెడ్ ఆర్ వో త్రిబుల్ వన్ మండిపడ్డారు.తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి వ్యవహరి స్తున్న తీరు ప్రజాస్వామ్యాన్ని భూస్థాపితం చేస్తోందన్నారు. దేశ ప్రజలు ఏం తినాలి, ఎలాంటి దుస్తులు వేసుకోవాలి, ఏ మతం అనుసరించాలి అని తానే నిర్ణయిస్తోందని ఆరోపించారు.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పాలన దేశానికి అత్యవసరమని దీనిని గుర్తించి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత యువజన కాంగ్రెస్లో చేరాలని ఆయన పిలుపు నిచ్చారు. ఆంధ్ర రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించాలని ఏఐసిసి నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే తాను జెడ్ ఆర్‌వోగా నియమితుడై ఎన్నికల నిర్వహణకు రావడం జరిగిందని తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యువజన కాంగ్రెస్‌లో మండల, అసెంబ్లీ కమిటీలకు, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు నామినేష న్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. 21వ తేదీ నాటికి నామినేషన్ల స్వీకరణ పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 7 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే వాటిని కూడా స్వీకరిస్తామన్నారు. ఈ ప్రక్రియ అంతా ఆన్లైన్ లోనే పూర్తవుతుందని ఆయన వివరించారు. 35 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు ఈ యువజన కాంగ్రెస్ ఎన్నికలలో పోటీ చేయడానికి అర్హులని ఆయన చెప్పారు. రాష్ట్రంలో తిరుపతి, ప్రకాశం, విజయనగరం జిల్లాలు ఎస్సీలకు రిజర్వేషన్ చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి కార్యకర్త దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జనవరి 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ఆంధ్ర రాష్ట్ర యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలియ జేశారు. యువజన కాంగ్రెస్ సభ్యత్వం ఉన్నవారు ఒక్కొక్కరు 6 ఓట్లు వేయాల్సి ఉంటుందని తెలిపారు. సభ్యత్వం ప్రక్రియలు కూడా ఆన్లైన్లో జరుగుతుందని అన్నారు. దేశంలో అత్యంత ప్రజాస్వా మ్యబద్ధంగా నిర్వహించబడుతున్నది యువజన కాంగ్రెస్ మాత్రమే అన్నారు.గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి రాజకీయంగా ఎదగడానికి కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అత్యుత్తమ అవకాశం కల్పిస్తోందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు బాల గురవం బాబు మాట్లాడుతూ దేశవ్యా ప్తంగా కాంగ్రెస్ పార్టీ ఒకటి రాజ్యాంగబద్ధంగా సంస్థాగత ఎన్నికలను నిర్వహిస్తోందని వివరించారు. విద్యార్థి, యువజన,మహిళ ఇతర విభాగాల అన్నింటికీ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిరుస్తోందని వివరించారు. తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కులమతాలకు పేద ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరు రాజకీయంగా ఎదగడానికి మంచి వేదిక అన్నారు.ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో గౌడపేరు చిట్టిబాబు, తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు, పీసీసీ జనరల్ సెక్రటరీ తమటం వెంకట నర్సింహులు, శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జ్ తలపామోదర్ రెడ్డి, ఎన్ ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిన్నే మల్లికార్జున్, తిరుపతి సిటీ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బివి గౌడ్, తిరుపతి జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షులు జ్యోతీశ్వర్ నాయక్, తిరుపతి సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పంచాంగములు అందజేత



**వాకాడు, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామ స్వామి దేవస్థానం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామ ధర్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు హనుమాన్ జంక్షన్‌లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో అర్చక, పురోహిత స్వాములకు నెల్లూరుపల్లి గమల్లపాలెం వాస్తవ్యులు చెంచయ్య, రామయ్య, కోటయ్య, వెంకటరామయ్యల ఆర్థిక సౌజన్యంతో అర్చక సమాఖ్య నాయకులు పీఏపీ ప్రసాదాచార్యులు, డాక్టర్ ఉదయగిరి వేంకట శేషాచార్యులు, కార్యనిర్వహణ అధికారి చిట్టిబాబు చేతుల మీదుగా పంచాంగములను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దైవిక, నిత్య నైమిత్తిక కార్యక్రమాలలో అర్చక, పురోహితులకు ఉపయుక్తమైన పంచాంగములను అందజేయడం చాలా సంతోషమని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను, దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చక స్వామి వాకాని కళ్యాణకృష్ణ, కందుకూరు శేషాచార్యులు, నరేష్, గోపి, జయకృష్ణ, మాధవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ని కలిసిన అంబేద్కర్ స్టార్ కృష్ణ



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ మెంబర్ అంబేద్కర్ స్టార్ కృష్ణ, ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఏ.వి.రాజు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ ఇప్పటికీ సమాజంలో ఎస్సీలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడానికి మరింత కఠినతరమైన చట్టాలు తీసుకొని వచ్చి, ఖచ్చితంగా అమలు జరిగేటట్లు చూడాలని కోరారు. అనంతరం ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఏ.వి.రాజు మాట్లాడుతూ ఆర్టీసీ ఎస్సీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు ఒక సమావేశాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని కోరగా అందుకు చైర్మన్ జవహర్ సానుకూలంగా స్పందించి తప్పనిసరిగా త్వరలో సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.వి.రావు, అడిషనల్ జెనరల్ సెక్రటరీ ఆర్.ఎస్.రావు, సీనియర్ నాయకుడు శాంసన్, ట్రెజరర్ కోటయ్య, ప్రచార కార్యదర్శి అనిల్, తిరుపతి జిల్లా నాయకులు అంజప్పా, వాసు పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం



**గూడూరు, (రాజధాని వార్తలు):** వివిధ ప్రభుత్వ శాఖలు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పని ఒత్తిడిని నివారించేందుకు ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ వేళల్లో అందరిని మానసికంగా ఆనందింప చేసేందుకు బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, టోర్నమెంట్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలోజరిగిన క్రికెట్‌టోర్నమెంట్ 2026 టి10 క్రికెట్ పోటీలను ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ కిషోర్ బాబు క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ ప్రారంభించారు. ఈ పోటీల్లో పలు ప్రభుత్వ శాఖల క్రీడాకారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా టీంలు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రూరల్ సీఐ కిషోర్ బాబు మాట్లాడుతూ పని ఒత్తిళ్లతో సతమతమయ్యే అన్ని శాఖల వారిని క్రికెట్ ద్వారా ప్రతి సంవత్సరం ఒక్కటి చేసే బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అభినందిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం ప్రారంభంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో విద్యుత్ శాఖ, ఉపాధ్యాయుల జట్లు పోటీ పడగా విద్యుత్ శాఖ సిబ్బంది విజయం సాధించారు. రెండో మ్యాచ్‌లో ప్రింట్ మీడియాపై ఎలక్ట్రానిక్ మీడియా విజయం సాధించింది. మధ్యాహ్నం వైద్య సిబ్బంది, పోలీస్ జట్లు తలపడగా వైద్య సిబ్బందిపై పోలీస్ జట్టు విజయం సాధించారు. అనంతరం న్యాయవాదులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది జట్లు తరపడగా న్యాయవాదులు విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, టోర్నమెంట్ ఆర్గనైజర్ ఆత్మకూరు సురేష్, అసోసియేషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



**తిరుపతి, (రాజధాని వార్తలు):** జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి అంశాలపై పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ, శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పిడిలు, తిరుపతి, శ్రీకాళహస్తి సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, రోడ్డు భవనాల శాఖ ఎస్.ఈ రాజా నాయక్, రైల్వే ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, పావన మూర్తి, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, ఎల్.శివకుమార్, ఈ ఈ ఇరిగేషన్ సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు, తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-1, 2కు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్పై వున్న సమస్యలను సత్వరమే పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట- పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట రేణిగుంట-పాకాల-తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, పీలేరు-కాలూరు, రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబం ధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యతతో పనులు పూర్తి కావాలని అన్నారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు భాస్కర్, శివ ప్రసాద్ భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామయ్య మృతికి సంతాపం

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు రామయ్య మృతదేహానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పున్నం వాసుదేవ నాయుడు, తొట్టంబేడు మండల అధ్యక్షలు కోగిల సుబ్రహ్మణ్యంలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చింతరాజేంద్ర, మురళి, డి.నాగరాజు, ఎం.నాగరాజు, మణి, గోపి తదితరులు పాల్గొన్నారు.



# విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మానవ సేవే మాధవ సేవ అన్నది విపిఆర్ ఫౌండేషన్ నినాదం అన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. నెల్లూరు మాగుంట లేఔట్లోని ఆమె నివాసంలో బుచ్చిరెడ్డిపాలెం మండలం రామచంద్రాపురం, ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామానికి చెందిన దివ్యాంగులకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి 2 ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ అందజేశారు. నడవలేని దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలనే లక్ష్యంతో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బ్యాటరీ ట్రై సైకిళ్ళు అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 11 వందల ట్రై సైకిల్స్ అందజేశామని కోవూరు నియోజకవర్గంలో దాదాపు 200 మందికి ఈ బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇచ్చినట్టు ఆమె స్పష్టం చేశారు. ట్రై సైకిల్స్ అందుకున్న దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వే తమకు కోట్ల రూపాయలతో సమానమన్నారు. ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ ద్వారా దివ్యాంగులు ఎవరి సాయం లేకుండానే బయటకు వెళ్లి స్వయం ఉపాధి పొందగలరన్నారు. ఆత్మ విశ్వాసానికి వైకల్యము అడ్డుకాదని నిరూపించాలని ఆమె దివ్యాంగులను కోరారు.

# ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డిని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం విజయవాడలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ ఫౌండర్ మెంబర్ అంబేద్కర్ స్టార్ కృష్ణ, ప్రెసిడెంట్ రాజ్యలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఏ.వి.రాజుల ఆధ్వర్యంలో ఈ.డి.ని పుష్పగుచ్ఛంతో అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టార్ కృష్ణ మాట్లాడుతూ.. ఆర్టీసీలో పనిచేస్తున్న దళిత, బహుజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ.డి. దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం మరింత సహకారం అందించాలని ఆయన కోరారు. అసోసియేషన్ విన్నపంపై ఈ.డి. బ్రహ్మానంద రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్యల విషయంలో ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.వి.రావు, అడిషనల్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. రావు, సీనియర్ నాయకుడు శాంసన్, ప్రచార కార్యదర్శి అనిల్ కుమార్, ట్రెజరర్ కోటయ్య మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan